నిర్జీవ నర్తకులు!!

అజీజ్

డిటెక్టివ్ ఉత్తమ్‌కుమార్ డాక్టర్ల సలహామీద కొన్నాళ్లు విశ్రాంతి తీసుకుందామనే వుద్దేశంతో తన అసిస్టెంట్ సంజయ్‌ని వెంటబెట్టుకుని మద్రాసువదిలి, ఊటీలో మకాం వేసి అప్పటికే వారంరోజులవుతోంది.

మద్రాసులో వున్నంతకాలం క్రిమినల్ కేసుల గొడవల్లో నిర్విరామంగా సతమతమయ్యే ఆ డిటెక్టివ్ ద్వయం, అక్కడి టూ స్టార్ హోటల్లో ఆ వారంరోజులూ నిశ్చింతగా, ఆహ్లాదంగా గడిపేశారు.

డిటెక్టివ్ ఉత్తమ్‌కుమార్ స్వతహాగా మౌనం, గాంభీర్యం మూర్తీభవించిన వ్యక్తి. మితభాషి. స్ఫురద్రూపి.

అతని అసిస్టెంట్ సంజయ్‌ది మాత్రం అందుకు భిన్నమైన తత్వం! నవ్వుతూ, నవ్విస్తూ చలాకీగా అందర్నీ ఇట్టే ఆకట్టుకుంటూ వుంటాడు.

ఊటీ వచ్చిన మూడవరోజు అనుకోకుండా పరిచయమైంది సంజయ్‌కి ప్రేరిత! త్వరలోనే వాళ్ళిద్దరి మధ్యా స్నేహం నెమలిపింఛంలా పురివిప్పింది.

ఆ అమ్మాయికి ఇరవైలోపే వుంటుంది వయసు. స్నేహపిపాసి. చూడగానే ఆకట్టుకునే వ్యక్తిత్వం! నిర్మలంగా, గలగల పారే సెలయేటివంటి నైజం!

విచిత్రం ఏమిటంటే, ఆ హోటల్లో ఆ అమ్మాయి ఒక్కర్తే బసచేస్తోంది. ఎవరూ తోడులేకుండా, విజయనగరంనించి వచ్చిందిట, కొన్నాళ్ళు పీస్‌ఫుల్‌గా గడిపి పోదామని.

అంతకుమించి ఆమె వ్యక్తిగత వివరాలు తెలుసుకోడానికి ఆట్టే ఆసక్తి చూపలేదు సంజయ్. ఆమెకూడ అతని వ్యక్తిగత జీవితం గురించి ఎన్నడూ అడగలేదు.

సాయంత్రం ఆరుగంటలకి ట్రిమ్‌గా తయారయి, లిఫ్ట్‌లో క్రిందికివచ్చి, బాల్ రూంలో ప్రవేశించాడు సంజయ్.

రంగురంగుల దీపకాంతులతో భూతల స్వర్గంలా వెలిగిపోతోంది విశాలమైన హాలు. ఎదురుగా డాన్స్ స్టేజ్ మీద ఆర్కెస్ట్రా సన్నని శ్రావ్యమైన ట్యూను మ్రోగిస్తూ ఆ వాతావరణాన్ని మరింత ఆహ్లాదకరంగా మారుస్తోంది.

యువ జంటలూ, వృద్ధజంటలూ అనే తారతమ్యం లేకుండా అందరూ టేబిళ్ళ నలంకరించి యెవరికి తోచిన పానీయాలు వారు తాగుతూ నవ్వులతో, ఛలోక్తులతో కులాసాగా కాలక్షేపం చేస్తున్నారు.

సంజయ్ ఓ కుర్చీలో చతికిలబడి, ప్రేరిత కనిపిస్తుందేమోనని చుట్టూ కలయచూశాడు. ఎక్కడా ఆమె ఐపులేదు. కాసేపట్లో రావచ్చు ఓపికపట్టాలి అను

కుంటూ సిగరెట్ అంటించి, వచ్చేపోయే జనాన్ని చూస్తూ కూర్చున్నాడు.

స్టేజ్ పై అంతవరకూ మోగుతున్న ఆర్కెస్ట్రా ఆగిపోయి, మైక్‌లో ఎనౌన్సర్ కంఠం వినిపించ సాగింది.

“విచిత్ర నర్తకులు! లేడీస్ అండ్ జంటిల్మన్! ప్రపంచంలో ఇంతవరకూ ఎక్కడా కనీవినీ ఎరగని అత్యంత ఆశ్చర్యంతో కూడిన విచిత్ర నర్తకుల డాన్స్ ప్రోగ్రాం ఎల్లుండి సాయంకాలం మీముందు ప్రవేశపెట్టబోతున్నాం.

ముందు ఆ నర్తకులనీ, ఆ తర్వాత వారు ప్రదర్శించే నాట్యాన్నీ చూసి మీరు నిజంగా దిగ్భ్రమ చెందుతారు. నాట్యానికి ముందు కాళ్ళు, చేతులూ కదపడం అటుంచి కనీసం ఊపిరికూడా సరిగ్గా తీసుకోలేనంత బలహీనంగా కనిపించే ఆ నర్తకులు, ఆ తర్వాత స్టేజిపై దృష్టివేగాన్ని మించిన చురుకుదనంతో, మెరుపుతీగల్లా ఏ విధంగా నాట్యం చేస్తారో చూసి, నిర్ఘాంతపోక తప్పదు.

జ్ఞాపకం వుంచుకోండి! ఎల్లుండి సాయంత్రం సరిగ్గా ఎనిమిదిగంటలకి ప్రదర్శించబోయే విచిత్ర నర్తకుల నాట్యాన్ని తిలకించడం మరవకండి” ఆ ప్రకటన విని ముఖం చిట్లించాడు సంజయ్.

అర్థపర్థంలేని అతిశయోక్తులతో నిండిన అటువంటి చొప్పదంటు ప్రకటనలంటే అతనికి నచ్చవు.

పూర్తయిన సిగరెట్‌ని ఏష్ట్రేలో నొక్కి తలెత్తగానే కనిపించింది ప్రేరిత. అతన్ని సమీపిస్తూ కాదు. అతని ముందునించే నడిచి వెళుతోంది.

బహుశా గమనించలేదు కాబోలు అనుకుంటూ చటుక్కున కుర్చీలోంచి లేచి “హలో, ప్రేరితా!” అన్నాడు సంజయ్.

ఆ అమ్మాయి ఉలిక్కిపడి వెనుదిరిగి, కనురెప్పలు టప టప లాడిస్తూ విచిత్రంగా చూసిందతని వైపు. సాధారణంగా పరిచయస్థులు కనిపించగానే ఎవరయినా పలకరింపుగా నవ్వుతారుగానీ, అలా నిర్వీరబోయి చూడరు.

సంజయ్ నవ్వి, "ఇదివరకెన్నడూ మనంకలుసుకోనట్టు అలా చూస్తావేం? ఇంత సేపూ నీకోసమే ఎదురు చూస్తున్నాను. కమాన్!" అన్నాడు.

ప్రేరిత పెదాలు బిగించి, "మిస్టర్! ఎవరు నువ్వు? ఆడపిల్ల ఒంటరిగా కనిపిస్తే చాలా? ఏకంగా పరిచయం కోసం పాకులాటమే! మనమిదివర కెక్కడ కలుసుకున్నామేమిటి?" అంది తీక్షణంగా.

సంజయ్ బిగ్గరగా నవ్వి, "నాచురల్ ఆక్టింగ్! నీకు నటనలోనూ మంచి ప్రావీణ్యం వుందని ఇప్పుడే తెలిసింది సుమా!" అన్నాడు విట్టు విసురుతూ.

ఆ మాటతో ప్రేరిత మొహం జేవురించింది. "ఏయ్ మిస్టర్! ఊరుకుంటోంటే మరీ మితిమీరుతున్నావు! మర్యాదగా ఇక్కణ్నించి వెళ్ళావంటే సరేసరి, లేదా చింతిస్తావు జాగ్రత్త."

సంజయ్ మనసు చివుక్కుమంది. ప్రేరిత నటించడం లేదు. సీరియస్‌గా అంటోందామాటలు. నిన్నటి వరకూ ఎంతో ఆత్మీయంగా, స్నేహంగా మసలిన మనిషి హాఠాత్తుగా దేనికలా మారిపోయింది? ఏమిటీ మాయ? జ్ఞాపకం వున్నంతవరకూ తనవల్ల ఏ పొరపాటూ జరగలేదే?

ఆ హఠాత్సంఘటనతో సంజయ్ అహం దెబ్బతింది. తలవంచుకుని "సారీ! పొరబడ్డాను. ఎక్స్‌క్యూజ్ మీ!" అంటూ వెనుదిరిగాడు.

లోలోన మండుతున్న దావానలాన్ని ఓపిక అనే

తేమతో ఆర్పడానికి ప్రయత్నిస్తూ తిరిగి సీట్లో కూలబడ్డాను. మళ్ళీ ఆ వసంస్కారివైపు కన్నెత్తి చూడకూడదు అనుకుంటూ జేబులోంచి సిగరెట్ తీసి అంటించాను.

అదే సమయంలో పొడుగ్గా, బలిష్టంగావున్న ఓవ్యక్తి అడుగులో అడుగు వేసుకుంటూవచ్చి అతనిముందు నిల్చున్నాడు. సంజయ్ తలెత్తి, కళ్ళు చిట్లిస్తూ ప్రశ్నార్థకంగా చూశాడతన్ని.

“నాలుగు రోజుల్నుంచీ గమనిస్తున్నాను నువ్వా అమ్మాయి చుట్టూ ప్రదక్షిణాలు చెయడం! ఆ పిల్లనితిరుగుబోతనుకున్నావట్రా? మళ్ళా ఆమె ఛాయలగ్గనక వెళ్ళావంటే, నీ ఎముకలు చూర్ణంచేసి, వక్కపొడుంలా వాడుకుంటాను జాగ్రత్త!” అన్నాడా వ్యక్తి పళ్ళునూరుతూ.

ముందే చిరాకులోవున్న సంజయ్ చివాల్న కుర్చీలోంచి లేచి, “ఏయ్ మిస్టర్! మాటలు కాస్త జాగ్రత్తగా రానియ్. నేను నువ్వనుకుంటున్నంత నాసిరకం మనిషినికాను. వెంటనే వెళ్ళిక్కణ్నించి!” అన్నాడు తీక్షణంగా.

“ఓరి చుంచెలుకా! నన్నే వెళ్ళమంటావుట్రా? ఎన్ని గుండెల్రా నీకు? చూడు నిన్నేం చేస్తానో!” పిడికిలి బిగించి అడుగు ముందుకు వేశాడతను.

అంతే! బూటుకాలితో మెరుపులా ఈడ్చి డొక్కలో ఒక్కతన్ను తన్నేడు సంజయ్. అతనా షాక్‌లోంచి తేరుకోకముందే పిడికిలిబిగించి దవడకింద పిస్టన్‌లా నాలుగయిదు ఇచ్చేడు. అతని పెదాలు చిట్లేయి. రక్తంకారుతోంది.

చేతులు దులుపుకొని కాలర్ సరిచేసుకున్నాడు సంజయ్. అప్పటికే హాల్లో కూర్చున్న వాళ్ళంతా వాళ్ళచుట్టూ మూగి, చోద్యం చూస్తున్నారు.

"ఏం జరిగింది?"

"దేనికలా కొట్టారు?"

"ఏంచేశాడు?" ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు జనం.

"ఇంకా ఏం చేస్తాడు? నా ప్రక్కనుంచి పోతూ, కోటు జేబులోంచి పర్సు కొట్టేశాడు."

"అబద్ధం! పచ్చి అబద్ధం! నేను వీడిపర్సు కొట్టలేదు" అరిచాడతను.

సంజయ్ జనంవైపు తిరిగి, "నామాట మీద విశ్వాసం లేకుంటే, మీరే వాడి జేబులు వెతకండి. ఆ పర్సులో నా ఫోటోతోపాటు మూడువందల అరవయి రూపాయల పదిపైసలున్నాయి" అన్నాడు.

"చూసుకోండి!" అంటూ చేతులు పైకెత్తాడతను.

జనంలోంచి ఇద్దరు ముందుకువచ్చి, అతని జేబులు గాలించి, ఓ నల్లరంగు పర్సుతీసి చూశారు. అందులో సంజయ్ ఫోటో, అతను చెప్పినంత డబ్బు బయటపడగానే ఆ వ్యక్తితోపాటు అందరి నోళ్ళూ తెరుచుకున్నాయి.

"నిజమే, పర్సు కొట్టేశాడు. తన్నండి వెధవని."

"కుమ్మండి బ్రూట్ ని!"

"పోలీసుల కప్పగించండి! పోలీసుల కప్పగించండి" అరుస్తున్నారు జనం.

"చాలు చాలు! నేనిచ్చిన డోస్‌తో వాడీ జన్మలో మళ్ళీ దొంగతనం జోలికిపోతే ఒట్టు. కోర్టుల చుట్టూ

తిరిగే తీరిక లేదు నాకు. వాణ్ని వెళ్ళనివ్వండి'' అన్నాడు సంజయ్ మధ్యలో.

ఆ వ్యక్తి అతన్ని నమిలి మింగేసేలా చూస్తున్నాడు. సంజయ్ అదేమీ పట్టించుకోకుండా తనపర్సు జేబులో వేసుకుంటూ లిఫ్ట్ వేపు నడిచాడు. నిజానికా పర్సు తన హస్తలాఘవంతో ఆ వ్యక్తి జేబులోకి చేర్చింది అతనే!

గదిలో అడుగుపెట్టిన సంజయ్‌ని చూసి, ''బట్టలన్నీ అలా నలిగి వున్నాయేమిటి?'' అడిగాడు డిటెక్టివ్ ఉత్తమకుమార్.

''అ...అబ్బే! కింద ఓ గర్ల్ ఫ్రెండ్‌తో డాన్స్ చేస్తూ ఆర్కెస్ట్రా మ్యూజిక్ స్పీడందుకునేసరికి నాకు తెలియకుండానే భరతనాట్యం ప్రారంభించాను. బూటు జారి బొక్కబోర్లా పడ్డాను. అందరూ కలిసి లేపేసరికి అవతారం ఇలా తయారయింది.''

''బొంకక! ఎవ్వరితోనో పోట్లాడి వస్తున్నావ్ కదూ?''

''మీకెలా తెలిసింది?'' అడిగాడు సంజయ్ ఆశ్చర్యంగా.

''నీ కుడిచేతి పిడికిలి చూసుకో! వేళ్ళభాగం వాచి వుంది. కమిలివుంది. ఈ నిదర్శనం చాలదూ?''

నీళ్ళు నమిలాడు సంజయ్.

''జాగ్రత్త! ఇది పరాయి ప్రదేశం! అనవసరంగా ఎవరితోనూ ఘర్షణ పడొద్దని ముందే నచ్చచెప్పాను. మన మిక్కడికి ఫైటింగ్ ప్రాక్టీస్ కు రాలేదు. విశ్రాంతి కోసం వచ్చాం!''

''అదికాదుసార్!'' అంటూ ప్రేరితతో తన పరిచయం, ఇన్నిరోజుల స్నేహం, హఠాత్తుగా ఈరోజు ఆమెలో వచ్చిన మార్పు, ఆ ఆగంతకుడితో ఘర్షణ మొదలైనవన్నీ పూసగుచ్చినట్టు వివరించాడు సంజయ్.

అంతావిన్న డిటెక్టివ్ ఉత్తమ్‌కుమార్ సాలోచనగా తలూపి, "విషయం ఆసక్తికరమైనదే! ఒప్పుకుంటాను. ఐనా, ఆ అమ్మాయి మనసులో మనకు నిమిత్తం లేదు. ఇప్పుడామె నీనుంచి దూరంగా వుండడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, నువ్వామెపట్ల ఇంట్రస్టు చూపడం అవివేకమే అవుతుంది. బట్టలు మార్చుకుని బుద్ధిగా పడుకో!" అన్నాడు సిగరెట్ అంటిస్తూ.

ఆరాత్రి చాలా పొద్దుపోయే వరకూ నిద్రపట్టలేదు సంజయ్‌కు.

ఆ అమ్మాయి విచిత్రప్రవర్తనే అతన్ని తీవ్రంగా ఆలోచింప చేస్తోంది. ముక్కూ, మొహం తెలియని ఆ ఆగంతకుడు ఆమెకు దూరంగా వుండమని తననెందుకు హెచ్చరించాడు? ఆమెకూ, అతనికీ ఏమిటి సంబంధం? ఇన్నాళ్లూ ఒంటరిగా వుంటున్న ప్రేరిత దగ్గరికి, పానకంలో పుడకలాగా అతనెక్కణ్నించి వచ్చాడు?

ఇలాటి సందిగ్ధమయిన సందేహాలతో చాలాసేపు సతమతమవుతూ నిదరలోకి జారుకున్నాడు సంజయ్.

2

ఉదయం నిద్ర లేచేసరికి తొమ్మిది గంటలయింది.

అప్పటికే ఉత్తమ్‌కుమార్ స్నానపానాదులు ముగించి న్యూస్ పేపర్ చూస్తూ కూర్చునున్నాడు సోఫాలో. ఆ హోటల్ వెనకే విశాలమైన స్విమ్మింగ్ పూల్ వుంది. దాదాపు చాలామంది యువతీ యువకులు వుదయంపూట అందులోనే స్నానాలు చేస్తూంటారు.

సంజయ్ కూడా ఆ స్విమ్మింగ్ పూల్ కలవాటు పడిపోయాడు. మంచం దిగి, స్లీపింగ్ గౌను తొడుక్కుని,

టవల్ అందుకొని స్విమ్మింగ్ పూల్‌కు బయలుదేరాడు సంజయ్.

అప్పటికే చాలమంది యువతీ యువకులు అక్కడ ఈతకొట్టి, నీరెండలో తడి శరీరాలు పొడి చేసుకుంటున్నారు.

హఠాత్తుగా సంజయ్ దృష్టి గతరాత్రి తనచేత దెబ్బలు తిన్న వ్యక్తిమీద పడింది. క్షణంపాటు అతన్ని గుర్తించలేక పోయాడు సంజయ్. కారణం, ఇప్పుడా వ్యక్తి తన గుబురు మీసాలు నున్నగా గీసేసుకున్నాడు.

అందుక్కారణం ఏమిటో ఊహించగలిగేడు సంజయ్. రాత్రి అతను చాలామంది మనసుల్లో దొంగగా ముద్రింపబడ్డాడు. వాళ్ళిప్పుడు తనను గుర్తించకూడదన్న ఉద్దేశంతోనే మీసాలు తీసేసుంటాడు. ప్రేరిత కూడా ఇక్కడే వుందా? అనుకుంటూ చుట్టూ కలయచూసాడు.

కనిపించింది. ఓపక్క స్విమ్మింగ్ డ్రెస్‌లో ఎండ కాచుకుంటూ కూర్చునుంది. అంతవరకూ ఇటే చూస్తున్నదల్లా, అతనటు చూడగానే చటుక్కున కళ్ళు తిప్పుకుంది!

కొందరు యువతీ యువకులు స్విమ్మింగ్ పూల్లో డయివింగ్ చేస్తున్నారు. అందులో ఏ ఒక్కరూ గాలిలోకి ఎగిరి పల్టీలువేసి డైవ్ కొట్టడం లేదు. చిన్నగా నవ్వుకుంటూ బట్టలువిప్పి, డ్రాయర్ మీద మెట్లవైపు నడిచేడు సంజయ్. మెట్లెక్కి పైకి చేరుకున్నాడు.

అక్కడ కూర్చున్న వాళ్ళందరి చూపులూ అతనివైపు మళ్ళాయి.

సంజయ్ ఛెంగున ఎగిరి ఓపిల్లిమొగ్గ వేసి, డైవ్ కొట్టాడు నీటిలోకి. ప్రేక్షకుల కరతాళ ధ్వనులు మారుమోగాయి.

సంజయ్ నీళ్ళలోంచి పైకి తేలి, ఈదుకొంటూ స్విమ్మింగ్ పూల్ రౌండ్ కొట్టి తిరిగి మెట్లని సమీపించాడు.

అదే సమయంలో ఓ అందమయిన అమ్మాయి సంజయ్ లాగా గాలిలో పల్టీ వేసి, నీళ్ళలో పడింది. అదిచూసి సంజయ్ కూడా వెంటనే పైకి చేరుకున్నాడు. ఈసారి అతను శూన్యంలో రెండు పిల్లి మొగ్గలు వేసి డైవ్ కొట్టాడు. ఆ అమ్మాయి కూడా పైకివచ్చి, రెండుపల్టీలుకొట్టి నీళ్ళలో దూకింది.

అలా ప్రారంభమయింది ఆ ఇద్దరిమధ్య పోటీ! కానీ, ఆ అమ్మాయి మూడుపల్టీలకు మించి వెయ్యలేక పోతోంది. సంజయ్ పట్టుదలగా ఐదు పల్టీలు కొట్టగలిగేడు గాలిలో. అప్పటికే ఇద్దరూ బాగా అలసిపోయి, పోటీ విరమించారు.

సంజయ్ టవల్‌తో ఒళ్లు తుడుచుకుంటూ వెళ్ళి ఎండలో పడుకున్నాడు. అయిదు నిమిషాల తర్వాత, డైవింగ్‌లో అతనితో పోటీపడ్డ అమ్మాయి తనవైపే వస్తూ కనిపించి, లేచికూర్చున్నాడు.

ఆమె చిరునవ్వుతో అతన్ని సమీపించి, "మీరు బాగా డైవ్ చేస్తారు సుమా!" అంది చలికిలబడుతూ.

సంజయ్ నవ్వి, "డయివింగ్‌లో నాకింకా అట్టే ప్రాక్టీస్ లేదు" అన్నాడు.

"మైగాడ్! ప్రాక్టీస్ లేకుండానే ఇంతబాగా డైవ్ చెయ్యగలిగితే, ప్రాక్టీసయ్యాక మీరు గాలిలో భరత నాట్యం మొదలెట్టినా ఆశ్చర్యంలేదు" అంది ఫక్కున నవ్వుతూ.

సంజయ్ సిగ్గుపడుతున్నట్లు అభినయం ప్రారంభించేడు.

"ఇంతకీ ఎక్కణ్నించి వచ్చారుమీరు?"

"ఇంటినుంచి!"

"అడిగానండీ, ఏ ఊర్నుంచీ అని?"

"మద్రాసు!"

"నా పేరు దీప."

"నన్ను సంజయ్ అంటారు. మీరెక్కణ్ణించి వచ్చారు?"

"మహాబలిపురం!"

"ఏం చేస్తుంటారు?"

"మా నాన్నగారు అక్కడ ఐరన్ ఫ్యాక్టరీలో ఛీఫ్ ఇంజనీర్ గా పని చేస్తున్నారు."

"మా నాన్నగారుకూడా బ్రతికుంటే, ఇలాగే నేనూ తిని తిరిగేవాణ్ణి!"

"సారీ. నేనింకా చదువుకుంటున్నాను."

సంజయ్ దృష్టి అనుకోకుండా ప్రేరిత కూర్చున్నవైపు మళ్ళింది. అంతవరకూ వీళ్ళిద్దర్నే కన్నార్పకుండా చూస్తున్న ఆ అమ్మాయి, చటుక్కున తల మరోవైపు తిప్పుకుంది.

"సంజయ్ గారూ! ఆ అమ్మాయిని చూశారా? చాలా సేపట్నుంచి గమనిస్తున్నాను. అదేపనిగా మిమ్మల్ని గుడ్లప్పగించి చూస్తోంది. పరిచయస్థురాలా?" అడిగింది దీప.

"లేదే!"

"ఆ అమ్మాయి దగ్గరున్న వానిటీబాగ్ లో చిన్నసైజు పిస్తోలుకూడా వుంటుంది ఎప్పుడూ!"

సంజయ్ ఉలిక్కిపడి, "మీకెలా తెలుసు?" అడిగాడు ఆశ్చర్యంగా.

"మా గదులు ఒకే అంతస్థులో వున్నాయి. మొన్న అనుకోకుండా మేమిద్దరం ఒకేసారి లిఫ్ట్ లో పైకెళ్ళడం జరిగింది. లిఫ్ట్ లోంచి బయటపడుతుండగా తలుపుతగిలి

ఆమె హాండ్ బ్యాగ్ కిందపడి తెరుచుకుంది. ఆ తెరుచు కోడంలో, దాంట్లోంచి కొన్ని సామానులు యివతలికి వచ్చాయి. వాటిలో చిన్నసైజు పిస్తోలుకూడా వుంది. అప్పుడు చూశాను."

"ఈమధ్య సిగరెట్ లైటర్లుకూడా పిస్తోళ్ళ ఆకారాల్లో వస్తున్నాయి. బహుశా మీరు చూసింది అదేనేమో?"

"ఏమో! మొత్తానికి ఆ అమ్మాయి నాకెందుకో చాల విచిత్రంగా తోస్తోంది సుమండీ!" అంది దీప స్వరం తగ్గించి.

సరిగ్గా అదే సమయంలో, వాళ్ళకు దూరంగా కూర్చున్న ఆ వ్యక్తి లేచి, హోటల్ వైపు వెళుతూ కనిపించాడు సంజయ్‌కి. అతనే అంతస్తులో, యే గదిలో వుంటున్నాడో తెలుసుకుందామని, తనూ లేచి, దీపదగ్గర సెలవు తీసుకుని అతన్ని వెంబడించాడు సంజయ్.

ఆ వ్యక్తి తిన్నగా మూడో అంతస్తు చేరుకుని, చిట్టచివరవున్న గదిలో ప్రవేశించాడు. ఆ గదికి నాలుగు గదుల ఇవతలే వుంది ప్రేరితగది!

సాలోచనగా తలూపుతూ వెనుదిరిగాడు సంజయ్. అవకాశం చూసుకుని ఆ వ్యక్తి గదిలో ప్రవేశించి గాలించాలి. అప్పుడు తెలుస్తుంది అతనెవరో?

3

ఆ సాయంత్రంకూడ సంజయ్ అలవాటు ప్రకారం బాల్ రూంలోకి వెళ్ళాడు. ప్రతి సాయంత్రం అక్కడేదో ఒక ప్రోగ్రాం వుంటుంది గనక, దాదాపు హోటల్లో

బసచేసే వాళ్ళంతా అక్కడచేరి ఆనందంగా గడుపుతూ వుంటారు.

ఆరోజు మిమిక్రీ షో వున్నట్టు బోర్డుమీద రాసుంది. షో యింకా ప్రారంభం కాలేదు. నిన్నటిలా మైక్ లోంచి మళ్ళీ రేపురాత్రి ప్రదర్శించబోయే 'విచిత్ర నర్తకుల' ప్రోగ్రాం గురించి ఎనౌన్స్ చేస్తున్నారు.

సంజయ్ దృష్టి అప్పుడే బాల్ రూంలో ప్రవేశిస్తున్న ప్రేరితమీద పడింది. ఆ వ్యక్తికూడా అక్కడున్నాడేమోనని చుట్టూ కలయజూసాడు. కనిపించలేదు.

ప్రేరిత సంజయ్ ముందునించే వెళ్ళినా, అతనివైపు కన్నెత్తికూడా చూళ్ళేదు.

కాస్సేపటికి మిమిక్రీ షో ప్రారంభమయింది.

సంజయ్ దృష్టి స్టేజిమీద లేదు. ఆ వ్యక్తికోసం గాలిస్తోన్నాయి చూపులు. ప్రేరితవచ్చి ఇంత సేపయినా అతని అయిపులేదు! నగరంలో కెళ్ళాడా? అయితే అతని గది గాలించడానికిదే అదను.

అనుకుంటూ లేచి, లిఫ్ట్ వైపు నడిచాడు సంజయ్. తిన్నగా మూడో అంతస్థు చేరుకొని, చిట్టచివరి గదిని సమీపించాడు. తలుపు మూసుంది. అవి డోర్ లాక్ సిస్టం తలుపులు. మూయగానే క్లిక్ మంటూ ఆటోమేటిక్ గానే లాక్ పడిపోతుంది.

ఓమారు చుట్టూ కలయచూసాడు. క్రింద ప్రోగ్రాం జరుగుతోంది గనక, నడవాలో జనసంచారంలేదు. జేబులోంచి తాళంచెవుల గుత్తితీసి, మాస్టర్ కీ అందుకొని లాక్ హోల్లో దూర్చాడు.

రెండు నిమిషాల ప్రయాసతో క్లిక్ మంది లాక్! పిడి తిప్పి మెల్లగా తోసాడు తలుపు. కిర్రుమంటూ తెరుచు

కుంది. లోన అడుగుపెట్టి కొయ్యబారిపోయాడు సంజయ్.

గదిమధ్యలో సోఫాలో అటుతిరిగి కూర్చునున్నారెవరో!

అతనేనా? తను పొరబడ్డాడా? అతను సిటీకెళ్ళలేదా? తను మాస్టర్ కీతో లాక్ తెరిచినప్పుడు క్లిక్ మన్న చప్పుడయింది. తలుపు తోసినప్పుడు కిర్రుమన్న చప్పుడయింది. అయినా ఇతను బెల్లంకొట్టిన రాయిలా కూర్చునున్నాదేమిటి?

అనుమానం వేసి, అడుగులో అడుగు వేసుకుంటూ పిల్లిలా సోఫా దగ్గరికి నడిచేడు. సోఫాని సమీపించి అతన్ని చూడగానే సంజయ్ గుండె ఒక్కసారి ఆగి, తిరిగి కొట్టుకోసాగింది.

అతను సజీవంగా లేడు! రక్తసిక్తమయిన బట్టలతో నిర్జీవంగా కూర్చునున్నాడు సోఫాలో. తల సోఫా వెనక ఆనించి వుంది. కళ్లు రెండూ తెరచి కిటికీని చూస్తున్నాయి. సరిగ్గా గుండెదగ్గర గాయం! లోతైన గాయం! ఆ గాయంగుండా కారి, షర్టుని ముద్దజేసిన రక్తం.

అనుభవాన్ని బట్టి, అది కత్తిపోటువల్ల ఏర్పడ్డ గాయమని క్షణంలో గ్రహించాడు సంజయ్. హంతకుడా కత్తిని అలాగే వదలకుండా తనవెంట తీసికెళ్ళాడు.

ఇక ఒక్క క్షణంకూడ అక్కడుండకూడదు. చటుక్కున వెనుదిరిగి గబగబ తలుపువైపు నడిచాడుసంజయ్. డోర్ కొద్దిగా తెరచి, నడవాలోకి తొంగిచూసాడు. ఎవ్వరూ కనిపించకపోయేసరికి చటుక్కున బయటికెళ్ళి తిరిగి తలుపు మూసేశాడు.

వడివడిగా అడుగులు వేసుకుంటూ లిఫ్ట్‌ను సమీపించి, చకచక నాలుగో అంతస్థు చేరుకున్నాడు.

అప్పుడే గదిలోంచి బయటకు వస్తోన్న డిటెక్టివ్ ఉత్తమకుమార్, సంజయ్ హడావుడిచూసి, "ఈరోజు తొందరగా వచ్చేస్తున్నావే?" అన్నాడు.

"అబ్బే, ఏంలేదు! ఒంట్లోకాస్త నలతగా వుంటేనూ" అని వాక్యం పూర్తిచెయ్యకుండా గదిలో ప్రవేశించాడు సంజయ్.

"రాత్రిళ్లు ఎక్కువ మేల్కొవద్దంటే విన్నావా? ఓ అనాల్జిన్ మాత్ర వేసుకుపడుకో" అంటూ బయటికెళ్ళి పోయాడు ఉత్తమకుమార్.

సంజయ్ తలుపులు దగ్గరగావేసి సోఫాలో చతికిల బడ్డాడు. అప్పుడుగానీ అతని మానసికస్థితి ఓ కొలిక్కి రాలేదు. ఆ వ్యక్తిని ఎవ్వరు హత్యచేశారు? యెందుకు చేశారు? అపరిచితుడిలాగే నటిస్తూ అతను ప్రేరితను నీడలా దేనికి కనిపెట్టుకునుండే వాడు?

ఇలా సాగుతున్నాయి సంజయ్ బుర్రలో సవాలక్ష ఆలోచనలు. వేటికీ సరయిన సమాధానం దొరకడంలేదు. అలా గంటగడిచి వుంటుంది. అంతలో బయట హడా వుడిగా అటూయిటూ పరిగెత్తుతూ మాట్లాడుకోడం విని పించింది.

తలుపు తెరుచుకున్న చప్పుడయి వెనుదిరిగి చూశాడు సంజయ్.

డిటెక్టివ్ ఉత్తమకుమార్ లోన అడుగుపెట్టి, "గత రాత్రి నీతోఘర్షణపడ్డ వ్యక్తి తనగదిలో చచ్చిపడున్నా డట. స్టీవార్డ్ద్వారా ఈసంగతి తెలియగానే, హోటల్లో పెద్ద దుమారం బయలదేరింది. కాసేపట్లో పోలీసులిక్కడికి రాబోతున్నారు.

ఆ వ్యక్తికీ, నీకూ జరిగిన ఘర్షణ గురించి జనం చెవులు కొరుక్కుంటున్నారు. ఆ సంగతి పోలీసుల చెవినబడితే, అనవసరంగా నీ పీకమీదికి రావచ్చు'' అన్నాడు.

''రానివ్వండి! పోలీసుల్ని యెలా ఆటపట్టించాలో నాకు తెలుసు.'' సంజయ్ ఇంకా ఏదో అనబోతుండగా టీపాయ్ మీది ఫోన్ మోగింది.

రిసీవర్ అందుకున్నాడు సంజయ్. ఆ కాల్ అతని పేరే వుందని చెప్పింది హోటల్ ఆపరేటర్.

''కనెక్టు చెయ్యండి!'' అన్నాడు.

మరుక్షణం అవతలినుంచి ఓ స్త్రీ కంఠం వినిపించింది, ''మై స్వీట్ హార్ట్! నీ ఋణం ఎలా తీర్చుకోమంటావు? ఆ వరదరాజన్ బారినుంచి నన్ను విముక్తురాల్ని చేసినందుకు మెనీ మెనీ థాంక్స్. నాకోసం ఒక మనిషిని చంపగలిగిన నీకు ఏమిచ్చినా తక్కువే.''

''వాట్?'' అరిచాడు సంజయ్.

అవతల క్లిక్‌మంది.

''హలో ఆపరేటర్! ఆ కాల్ ఎక్కణ్నుంచివచ్చింది నాకు?'' అడిగాడు సంజయ్.

''సారీ చెప్పడం కష్టం!''

''ఈ హోటల్లోంచి రాలేదా?''

''నో! ఔట్‌సైడ్ కాల్!''

''కొంపదీసి, పొరపాట్న నాకు కనెక్టు చేయలేదు కదా?''

''రూం నెంబర్ 110 నించేకదూ మీరు మాట్లాడు తోంది.''

''ఔను.''

''ఐతే, అది మీకాలే!''

రిసీవర్ దించి లేచాడు సంజయ్.

"ఏమిటి కథ?" అడిగాడు ఉత్తమకుమార్.

సంజయ్ జరిగింది వివరించి, "ఆమె ఎవ్వరో నాకు తెలీదు. ఆ కంఠాన్ని నేనింతవరకూ విన్లేదు!" అన్నాడు.

"కంఠాలుమార్చి మాట్లాడటం ఏమంత కష్టమయినపని కాదు. నువ్విక్కడేవుండు. నేవెళ్ళి ప్రేరితను చెక్ చేసి వస్తాను. గదిలో ఆమెవుంటే, ఆ ఫోన్ చేసిన స్త్రీ ఆమె కాదని స్పష్టమౌతుంది. కారణం ఔట్ సైడ్ నుంచిఫోన్ చేసి, ఇంత త్వరగా సిటీనుంచి ఎవ్వరూ తిరిగిరాలేరు.

ఈ సంఘటనతో నువ్వు పోలీసుల దృష్టిలో నానడం మాత్రం ఖాయం. ఎందుకంటే, ఆ కాల్ గురించి నువ్వు ఆపరేటర్ని తరచి తరచి ప్రశ్నించావ్. ఈ విషయాన్ని ఆమె అంత త్వరగా మర్చిపోదు. వెయిట్ మి!" అంటూ బయటకి నడిచాడు ఉత్తమకుమార్.

4

తీవ్రంగా ఆలోచిస్తూ సోఫాలో చతికిల బడ్డాడు సంజయ్. ఐదు నిమిషాలతర్వాత, ఎవరో దబదబ తలుపు బాదిన శబ్దం వినిపించింది.

"ఎస్, కమిన్" అన్నాడు.

తలుపు తోసుకుంటూ హడావుడిగా లోనికి వచ్చింది దీప. ఆయాసంతో ఆమె ఛాతీ ఎగిసిపడుతోంది.

"హలో మీరా! రండి, కూర్చోండి. ఎందుకలా గాభరా పడుతున్నారు?" అడిగాడు సంజయ్.

ఆమె సోఫాలో కూలబడుతూ, "అతికష్టంమీద మీ గది కనుక్కోగలిగాను. మీకా వ్యక్తి హత్యగురించి ఇంకా తెలీదా?" అడిగింది.

"తెలిసింది." అన్నాడు సంజయ్ చాలా నింపాదిగా.

"పోలీసులు వచ్చేశారు. గత రాత్రి మీరనితో ఘర్షణ పడ్డ సంగతి చెప్పేశారు ప్రత్యక్ష సాక్షులు."

"ఆ సమయంలో అతనికి అందమైన మీసాలుండేవనీ, ఇప్పుడా మీసాలు తీసివేయబడ్డాయనీ చెప్పలేదా వాళ్ళు?"

"చెప్పారు! ఐనా...." దీప కంఠంలో అనుమానం తొంగిచూసింది.

"అర్థమయింది! ఆ హత్యలో నా చెయ్యుందేమోనని మీరనుమాన పడుతున్నారు కదూ?"

"నో, నో. ఆ హత్యవార్త మీవరకు చేరవెయ్యాలనే ఇలా పరిగెత్తుకొచ్చాను. ఈరోజు మధ్యాహ్నం లంచ్ తీసుకుంటున్నప్పుడు డైనింగ్ హాల్లో ఆ వ్యక్తి నాతో మాట్లాడాడు."

"ఏమని?"

"మీతో నాకు పూర్వ పరిచయముందా అని అడిగాడు."

"మీరేమన్నారు?"

"లేదు, ఈరోజే స్విమ్మింగ్ పూల్ దగ్గర స్నేహమయిందన్నాను."

"ఆల్ రైట్! ఇక వెళ్ళండి. పోలీసులు ఏ క్షణంలో నయినా నాకోసం ఇక్కడికి రావచ్చు."

"పోలీసులంటే మీకు భయంలేదా?"

"లేదు, అందమైన అమ్మాయిలంటేనే చచ్చేభయం"

"పోలీసులు మిమ్మల్ని అనుమానంమీద అరెస్ట్ చేస్తే?"

"మరీ మంచిదే! కనీసం ఈ హోటల్ ఖర్చులయినా కలిసి వస్తాయి. హాయిగా ప్రభుత్వాం ఆతిథ్యం స్వీకరిస్తూ

ఇక్కడి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తాను. ఇక వెళ్ళండి!''

''ఆల్ రైట్'' అంటూ లేచి వెళ్ళిపోయింది దీప.

ఆమె వెళ్ళిన ఐదు నిమిషాలకే, ఓ కానిస్టేబుల్ గది లోకి వచ్చి, ''సంజయ్ గారు మీరేనా?'' అడిగాడు.

''ఔను, ఏం?''

''మిమ్మల్ని ఇన్‌స్పెక్టర్ పిల్చుకురమ్మన్నారు.''

''ఎందుకూ?''

''తెలీదు. మేనేజర్ గదిలో వున్నారాయన.''

''పద,'' అంటూ లేచాడు సంజయ్.

అదే సమయంలో డిటెక్టివ్ ఉత్తమకుమార్ వచ్చేడు గదిలోకి. ''మేనేజర్ గదిలో పోలీసులు నీ కోసం ఎదురు చూస్తున్నారు. సవాలక్ష ప్రశ్నలతో విసిగించి ఇప్పుడే వదిలిపెట్టారు నన్ను. వెళ్ళి వాళ్ళనెలా ఎదుర్కొంటావో చూడు.''

సాలోచనగా తలూపుతూ కానిస్టేబుల్ వెంట బైటికి నడిచాడు సంజయ్. మేనేజర్ గదిలో ఓ ఇన్‌స్పెక్టర్, సబిన్‌స్పెక్టర్, ఇద్దరు సార్జంటులూ అతనికోసం ఎదురు చూస్తున్నారు.

''హంతుడు వరదరాజన్‌తో మీ కెప్పట్నుంచి పరిచయం?'' అడిగాడు ఇన్‌స్పెక్టర్.

''నా జీవితంలో అతన్ని మొదటిసారి చూసింది నిన్న రాత్రే!''

''రాత్రి ఎందుకు కొట్టేరతన్ని?''

''పర్సు కాజేసినందుకు.''

''అతను మీ పర్సు కాజేసాడనడానికి ఏమిటి సాక్ష్యం? ఆ సమయంలో అక్కడెవరున్నారో చూపించగలరా?''

"చాలామందే వున్నారు. వాళ్ళందర్నీ జ్ఞాపకం పెట్టుకొనే స్థితిలో నేను లేనప్పుడు!"

"ఐతే, తాగివున్నారన్న మాట."

"కాదు, కోపంలో వున్నాను."

"ఆకోపం ఇప్పటికీ అలాగే వుండిపోయిందన్నమాట."

"సారీ, మీ ప్రశ్న నాకర్థం కాలేదు."

"అవుతుంది. ఇంతవరకూ మీరెక్కడున్నారు?"

"నా గదిలో."

"మధ్యలో ఎక్కడికీ వెళ్ళలేదా?"

"నో!"

"ఆల్ రైట్! మేము మీగది సోదా చెయ్యాలి!"

"సెర్చి వారంట్ వుందా?"

"ఓహో, సెర్చివారంట్ కావాలన్నమాట తమరికి?"

"అక్కర్లేదనుకున్నారా? ఆ మాత్రం రూల్సు నాకూ తెలుసు!"

"అయితే, రూల్సు తెలిసిన వాళ్ళతో మేమెలా ప్రవర్తిస్తామో కూడా తెలుసనుకుంటాను."

అదే సమయంలో డిటెక్టివ్ ఉత్తమ్‌కుమార్ వచ్చాడక్కడికి.

"మేము మీగది సోదాజెయ్యడానికి రూల్సుప్రకారం సెర్చివారంట్ అడుగుతున్నాడు మీ మిత్రుడు. అలాగే, రూల్సుప్రకారం అరెస్ట్ వారంట్ లేకుండా కేవలం అనుమానంమీద ఈయన్ని అరదండాలతో అలంకరించి తీసికెళ్ళాలనుకొంటున్నాము. మీరేమంటారు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

ఉత్తమ్‌కుమార్ సంజయ్‌ని నాలుగు చీవాట్లు పెట్టి, "ఎక్స్‌క్యూజ్ మీ ఇన్‌స్పెక్టర్! అమావాస్య, పున్నమి

రాత్రుల్లో వస్తాడు కాస్త తలతిక్కగా మాట్లాడుతుంటాడు. ఆగది నా పేర వుంది గనక, మీరు నిస్సంకోచంగా సోదా చేసుకోండి" అన్నాడు.

"థాంక్స్!" అంటూ లేచాడు ఇన్‌స్పెక్టర్.

మరుక్షణం పోలీసు పటాలం వారి గదిలో ప్రవేశించి, అంగుళం వదలకుండా గాలింపు చర్య ప్రారంభించింది. అనుమానాస్పద వస్తువేదీ దొరకలేదు.

దాంతో ఇన్‌స్పెక్టర్ నిరుత్సాహపడి, "ఆల్ రైట్! మా అనుమతి లేనిదే మీరీవూరు విడిచి వెళ్ళడానికి వీలు లేదు." అంటూ హెచ్చరించి వెళ్ళిపోయాడు.

ఉత్తమకుమార్ తలుపు గడియవేసి, సంజయ్‌ని సమీపించేడు. అతని మొహం జేవురించి వుంది. జేబులోంచి కర్చీఫ్‌లో చుట్టివున్న పొడుగాటి వస్తువుతీసి, "ఏమిటిది?" అన్నాడు తీక్షణంగా.

ఆ వస్తువు చూడగానే సంజయ్ నోరు తెరుచుకుంది.

అది కత్తి! రక్తసిక్తమైన కత్తి!!

"ఎక్కడ దొరికింది?" అడిగాడు ఆశ్చర్యంగా.

"ఈ గదిలోనే!"

"ఈ గదిలోనా?"

"ఔను. అదుగో ఆ సోఫాకింద! హతుడి గుండెలో వుండవలసిన కత్తి ఇక్కడికెలా వచ్చింది?"

ఆ సోఫావైపు చూసి ఉలిక్కిపడ్డాడు సంజయ్. "మైగాడ్! మీరు బైటికెళ్ళిన సమయంలో దీప వచ్చి ఆ సోఫాలో కూర్చుంది. కొంపదీసి..."

"దీప ఎవ్వరు? ఎలా పరిచయమైంది నీకు?"

చెప్పాడు సంజయ్.

"ఎన్నాళ్ళనించీ వుంటోందిట ఇక్కడ?"

"తెలీదు. ఆమెదీ ఊరుకాదు. మహాబలిపురం! వాళ్ళ నాన్న అక్కడి ఐరన్ ఫ్యాక్టరీలో చీఫ్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాడుట."

"సంజయ్! నీకు మతిపోయిందా? మహాబలిపురంలో ఐరన్ ఫ్యాక్టరీ ఏమిటి? ఇంతక్రితం కంఠంమార్చి నీకు ఫోన్ జేసిన స్త్రీకూడా ఆమే అయ్యుంటుంది. ముందు మనం ప్రేరితను అనుమానించాం! నేవెళ్ళి చెక్ జేస్తే, ఆమె తన గదిలోనే వుండిపోయింది. దేనికైనా మంచిది, ఈ ఇద్దరమ్మాయిల్నీ ఓ కంట కనిపెడుతుండాలి! అనుకోకుండా మనమీ రొంపిలో దిగబడ్డాం గనక, దీని అంతు చూడందే ఇక్కణ్నించి కదలకూడదు." అన్నాడు ఉత్తమ్ కుమార్ దృఢంగా.

5

"ఈ రాత్రి హోటల్లో విచిత్ర నర్తకుల ప్రోగ్రాం వుంది. రెండు రోజుల్నించీ ఆ ప్రోగ్రాం గురించి ఎనౌన్స్ చేస్తున్నారు. వెళదామా?" అడిగాడు సంజయ్.

"విచిత్ర నర్తకులు! పేరు క్యూరియస్ గా వుంది. చూడాలి!" అంటూ లేచాడు ఉత్తమ్ కుమార్.

ఇద్దరూ లిఫ్ట్ లో కిందికి చేరుకుని, హాల్లో ప్రవేశించారు. అప్పటికే హాలు జనంతో కిటకిటలాడుతోంది. ఒకటీ అరా తప్ప కుర్చీలన్నీ నిండుకున్నాయి. ఓ చోట రెండు కుర్చీలు ఖాళీగా వుంటే వెళ్ళి చతికిలబడ్డారు.

స్టేజిమీద సన్నగా ట్యూన్ అవుతోంది ఆర్కెస్ట్రా. మైక్ లో మాటిమాటికీ ఎనౌన్స్ చేస్తున్నారు, ఎనిమిది గంటలకు ప్రోగ్రాం ప్రారంభమౌతుందని. ప్రేక్షకులంతా ఊపిరి బిగబట్టి ఎదురు చూస్తున్నారు ఆ విచిత్ర నర్తకుల్ని వీక్షించడానికి!

ఎనిమిది గంటలకు ఒక నిమిషం వుందనగా, ఆరు చక్రాల కుర్చీలు తోసుకుంటూ స్టేజిమీదికి వచ్చారు హోటల్ సిబ్బంది. ఆ కుర్చీల్లో ముగ్గురు యువతులూ, ముగ్గురు యువకులూ కూర్చునున్నారు.

కేవలం కనురెప్పలు కదలడంతప్ప వారి శరీరంలో ఏమాత్రం చలనం లేదు. పక్షవాతం సోకిన రోగుల్లా, ఎన్నో ఏళ్ళనించి అన్నపానాలూ, నిద్రాహారాలూ లభ్యం కాని మనుషుల్లా నీరసంగా, బలహీనంగా కనిపిస్తున్నారు.

“ఈ పీనుగులా నాట్యం చేసేది?” అన్నాడు సంజయ్ ఆశ్చర్యంగా.

అదే సమయంలో మైక్‌లోంచి ఎనౌన్సర్ కంఠం వినిపించింది. “డియర్ ఫ్రెండ్స్ చూడండి. వీళ్ళే ఆ విచిత్ర నర్తకులు! నిర్జీవ నర్తకులు!!

ప్రేక్షక మహాశయుల్లో కొందరు డాక్టర్లుకూడా వుండి వుంటారు. దయచేసి, వారు స్టేజిమీదికి వచ్చి, ఈ నర్తకుల్ని క్షుణ్ణంగా పరిశీలించవలసిందిగా మనవి చేసుకుంటున్నాం! ఈ స్థితిలో వున్న ఏ మనిషీ, నాట్యం చెయ్యడం అటుంచి, కూర్చున్న చోటినించి లేచి నిలబడే ధైర్యంకూడా చెయ్యలేడని నిస్సందేహంగా చెప్పవచ్చు. కాని, ఈ స్థితిలో వున్న ఈ నర్తకులు, మేమిచ్చే ఎనర్జిన్ అనే మందు తాగి, తుఫానుతో పోటీపడుతూ నాట్య ప్రదర్శన ఇచ్చి మిమ్మల్ని దిగ్భ్రాంతుల్ని చెయ్యగలరు! ప్రేక్షకుల సంతృప్తికోసం డాక్టర్ మహాశయులు వీళ్ళని ఒకసారి పరీక్షించవలసిందిగా మరోసారి వేడుకుంటున్నాం!”

హాల్లో గుసగుసలు ప్రారంభమయ్యాయి. అక్కడక్కడా కొందరు లేచి నిలబడ్డారు. ఈ అవకాశాన్ని

సద్వినియోగం చేసుకోవాలనుకున్నాడు ఉత్తమకుమార్. తనూ లేచి, ఆ డాక్టర్లతో బాటు స్టేజివైపు నడిచేడు.

ప్రేక్షకుల్లోంచి మొత్తం నలుగురు డాక్టర్లు లేచి వచ్చారు స్టేజిమీదికి. వంతులవారిగా ఒక్కొక్కరూ ఆ నర్తకుల్ని పరీక్షించడం ప్రారంభించారు. డిటెక్టివ్ ఉత్తమకుమార్ కూడా వాళ్ళతో బాటు పరీక్షిస్తున్నట్లు నటించసాగేడు. పదిహేను నిమిషాల తరవాత ముగిసింది పరీక్ష.

"గౌరవనీయులైన డాక్టర్ మహాశయులు, తమ నిర్ణయాలని, మిగతా ప్రేక్షకులకు విన్నవిస్తే బావుంటుందని మా అభిప్రాయం!" అన్నాడు అనౌన్సర్ మైక్‌లో.

డాక్టర్లు అక్కడే నిల్చుని తమలోతాము కాసేపు చర్చించుకుని ఓ నిర్ణయానికి వచ్చారు. వారిలో కాస్త వయసుమళ్ళిన డాక్టర్ ఒకరు మైక్ దగ్గరికెళ్ళి చెప్పసాగాడు.

"మేమా నర్తకుల్ని క్షుణ్ణంగా పరిశీలించాం! వాళ్ళు ఎంతోకాలం రకరకాల దీర్ఘరోగాలతో బాధపడి, ఈ మధ్య కోలుకున్నట్లు కనిపిస్తున్నారు. అంత మాత్రాన వారిలో లేచి నడవగలిగే శక్తి లవలేశమూ లేదిప్పుడు.

అటువంటి శల్యశరీరాలు తుఫానుతో పోటీపడుతూ నాట్యం ఎలా చేస్తారో మా కంతుబట్టకుండా వుంది. అటువంటి ప్రయత్నం ఏమాత్రం చేసినా, వాళ్ళ హార్ట్‌ఫేల్ కావడం మాత్రం ఖాయం! ఏది ఏమైనా, ఇటువంటి పరిస్థితిలో వాళ్ళు అటువంటి సాహసం చెయ్యడానికి డాక్టర్లుగా మేమనుమతించలేము!" అని స్టేజి దిగాడు డాక్టర్.

వెంటనే అనౌన్సర్ మైక్ దగ్గరికి వచ్చి, "ఫ్రెండ్స్! విన్నారుకదా, డాక్టర్ల అభిప్రాయం? అటువంటి శ

జీవులు ఇప్పుడు ఏ విధంగా శక్తిని పుంజుకుంటారో మీరే చూడండి!'' అంటూ రెండుసార్లు చప్పట్లు చరిచాడు.

వెంటనే ఓ బట్లర్ ఓ ట్రాలి తోసుకుంటూ వచ్చా డక్కడికి. ఆ ట్రాలీపైన ఆరు గ్లాసులున్నాయి. వాటిలో చిక్కని నారింజరంగు ద్రవం వుంది.

"చూడండి, ఆ గ్లాసులో వున్న ద్రవంపేరే ఎనర్జీన్! దాన్ని తాగాక, ఆశక్తిహీనులు ఎలా మారిపోతారో ప్రత్యక్షంగా వీక్షించండి'' అన్నాడు ఎనౌన్సర్.

చక్రాల కుర్చీలు తోసుకొచ్చిన బట్లర్లు తలో గ్లాసు ఎత్తి నర్తకుల కందించారు. వాళ్ళా గ్లాసులు పట్టుకున్న తీరు చూస్తోంటే ఏ క్షణంలోనైనా అవి పట్టుతప్పి కింద పడేట్టున్నాయి. బట్లర్ల సహాయంతోనే వాళ్ళా గ్లాసులెత్తి మందు తాగగలిగారు.

మరుక్షణం స్టేజిమీంచి ట్రాలీ తొలగించబడింది. బట్లర్లు తలోవైపు తప్పుకున్నారు. స్టేజి నాలుగు వైపులా ఫుడ్‌లైట్స్ వెలిగాయి. అంతవరకూ సన్నగా మోగుతున్న ఆర్కెస్ట్రా ఇప్పుడు శాస్త్ర పికప్ అందుకుంది. డాక్టర్లం దరూ తమ తమ సీట్లలోకే వచ్చారు.

అలా ఐదు నిమిషాలు గడిచి వుంటాయి. క్రమక్రమంగా మ్యూజిక్ క్లైమాక్స్ నందుకుంది.

అంతే! అంతవరకూ నిర్జీవంగా చక్రాల కుర్చీల్లో చతికిల బడున్న ఆ నర్తకులు మెరుపు తీగల్లా ఛెంగున స్టేజి మీదికి గెంతారు. పది నిమిషాల క్రితం కాంతిహీనంగా, డస్సిపోయినట్టున్న వాళ్ళ మొహాల్లో ఇప్పుడు దివ్య తేజస్సు ప్రస్ఫుటమౌతోంది!

ప్రేక్షకులంతా కళ్ళు విప్పార్చి, చూడసాగారు స్టేజివైపు. ఆర్కెస్ట్రా కనుగుణంగా నర్తకులు ప్రదర్శిస్తున్న

నాట్యం అందర్నీ చకితుల్ని చేస్తోంది. క్రమక్రమంగా మ్యూజిక్ వేగం అందుకుంటోంది. వాద్యగాళ్లు చమటతో తడిసిపోతున్నారు. విపరీతంగా ఆయాసపడిపోతున్నారు.

"ఐనా, నర్తకుల్లో ఏమాత్రం నీరసం కనపించడం లేదు. క్లారినెట్స్ వాయిస్తున్న వాద్యగాళ్ళ నోళ్ళు నెప్పెడుతున్నాయి. డ్రమ్స్ కొట్టేవాడి చేతులు మొద్దు బారుతున్నాయి. నర్తకులు వాళ్ళ ననుసరించడంలేదు. వాళ్ళే నర్తకుల్ని ఫాలో అవుతున్నారు.

భుజం తిమ్మిరెక్కేసరికి వయొలెనిస్ట్ తన వాద్యాన్ని పక్కనపెట్టి ఉస్సూరుమంటూ కూలబడిపోయాడు. దాదాపు గంటవరకూ నడిచిందా నాట్యప్రదర్శన. ఆ తర వాత ఎక్కడివాళ్ళక్కడ నిలిచిపోయారు. ఆర్కెస్ట్రా ఆగిపోయింది. నర్తకులంతా ఒకే వరసలో స్టేజిమధ్య నిల బడి పోయారు.

మరుక్షణం వాళ్ళు కనిపించకుండా పైనించి తెర దిగింది.

ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో హాలు మారుమోగింది!

"ఫ్రెండ్స్! దేశంలో మొట్టమొదటిసారి ఈ కార్య క్రమం మీముందే ప్రదర్శింపబడిందని తెల్పడానికి చాలా గర్విస్తున్నాం! చూశారా, ఎనర్జిన్ మందు పుచ్చుకోగానే ఆ నిర్జీవుల్లో ఎలా జీవం పుంజుకుందో?

అంతకు ముందు వాళ్ళను పరీక్షించిన డాక్టర్లు, ఆ మనుషులు లేచి నిల్చోడానిక్కూడా శక్తిలేని వారనీ, నాట్యం చెయ్యడం అసంభవమనీ తమ అభిప్రాయాన్ని వెల్లడించారు కదా?

మానవ మేధస్సుకూ, కృషికీ అసంభవమన్నది వుందం టారా ఈ సృష్టిలో? శబ్దాన్ని మించిన వేగంతో పయ

నించే విమానాలని ఎవరు సృష్టించారు? వాయువేగంతో నడిచే రైళ్లని ఎవరు కనిపెట్టారు? చంద్రమండలంలోనూ, చివరికి అంగారక గ్రహంలోనూ సంచరించి వచ్చే వాహనాల నెవ్వరు తయారుచేశారు?

మనిషి!

ఆ నిర్జీవ వాహనాల చలనానికి జీవం ఏమిటి?

ఇంధనం!!

ప్రాణరహితమైన ఆ యంత్రాల్లో అటువంటి చలనం సృష్టించగలిగిన మనిషి, తాను కేవలం అనారోగ్య కారణంగా, నిస్సత్తువతో పడివుండటమా? యంత్రాలవల్లే మానవ దేహంలోని అవయవాలకూ అద్భుత శక్తిని తెప్పించే ప్రక్రియ ఎందుకు కనిపెట్టకూడదు?

ఈ మోటివ్ మీదే పరిశోధనలు జరిపి, అహోరాత్రులు శ్రమించి, ఎన్నో ఏళ్ళ ప్రయాసతో ఎనర్జిన్ మందు కనిపెట్టారు ప్రొఫెసర్ విఘ్ణవర్ధన్! ఆ ప్రఖ్యాత కెమిస్ట్ గురించి తెలియని వారున్నారంటారా మీలో?

పేరు ప్రఖ్యాతల నాపేక్షించకుండా, తన మేధా సంపత్తిని కేవలం మానవ కళ్యాణానికే వినియోగించే వాళ్ళెంతమంది వుంటారీ లోకంలో? ఇదివరకు ఆయన కనిపెట్టిన - రకరకాల రుగ్మతల నరికట్టే మందులెన్నో మార్కెట్లో పోటాపోటీలుగా అమ్ముడుపోతున్నాయి.

ఈ ఎనర్జిన్ మందుకూడా అతి త్వరలో మార్కెట్ లోకి రాబోతోంది. ఎదురు చూడండి. మరిచిపోకండి. ఎనర్జిన్!''

''బావుంది! ఇంతా చేసి, పబ్లిసిటీ ప్రదర్శనా ఇది. రెండు రోజులుగా దీని గురించి ప్రకటిస్తోంటే, ఏప్రెల్ ఫూల్ చేస్తున్నారేమో అనుకున్నాను'' అన్నాడు సంజయ్.

"నా కిదంతా ఏప్రిల్ ఫూల్ గానే తోస్తోంది!" అన్నాడు ఉత్తమకుమార్ నవ్వుతూ.

"మొత్తానికి పబ్లిసిటీకోసం మంచి మార్గాన్నే ఎన్నుకున్నారు వెధవలు! ఈ దెబ్బతో ఆ మందు మార్కెట్లోకి రాగానే జనం ఎగబడి తన్నుకుపోరూ?"

సాలోచనగా తలూపాడు ఉత్తమకుమార్. అప్పుడే అతని దృష్టి, అంతక్రితం మైక్‌లో మాట్లాడిన డాక్టర్ మీద పడింది.

"పద! ఆ డాక్టర్‌తో కొన్ని విషయాలు చర్చిద్దాం!" అంటూ లేచి అటు నడిచాడు.

డిటెక్టివ్ లిద్దరూ వెళ్ళి, డాక్టర్ కెదురుగా కూర్చున్నారు.

"మాతోబాటు మీరూ ఆ నర్తకుల్ని పరీక్షించారు కదూ?" అడిగాడు డాక్టర్ ఉత్తమకుమార్ని పలకరింపుగా.

"ఔను. ఇప్పటికీ నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. ఆ స్థితిలో ఆ నర్తకులు ఆ విధంగా డాన్స్ ఎలా చెయ్యగలిగారంటారు?"

"నాకూ అదే అంతుబట్టడం లేదు. మొత్తానికి నావల్ల పెద్ద మూర్ఖత్వం జరిగిపోయింది."

"ఏమిటది?"

"వీళ్ళీ ప్రదర్శనన్ని పబ్లిసిటీకోసం వినియోగించుకుంటున్నారనుకోలేదు."

"నేనూ అలా అనుకోలేదు. కూటికోసం కోటి విద్యలని ఊరికే అన్నారా? ఇంతకీ, ప్రొఫెసర్ విష్ణువరన్ ఎక్కడున్నారిప్పుడు? మీరాయన్ని చూశారా?"

"చూల్లేదు. మెడికల్ జర్నల్ లోనూ పత్రికల్లోనూ ఆయన పేరు చదవడమే తప్ప ఆయన ఫోటో కూడా చూసి ఎరగను. ఫోటో ప్రచురణకూ, వ్యక్తిగత ప్రచారానికీ ఆయన ఒప్పుకోడట. ఆదినించీ ఆయన అజ్ఞాతవాసంలోనే వుండి, తన పరిశోధనలు సాగిస్తున్నాడు.

అటువంటి నిరాపేక్షుడు తను కనిపెట్టిన మందును ప్రచారం చెయ్యడానికి ఇటువంటిమార్గాన్ని చేపట్టాడంటే విడ్డూరంగానే వుంది!"

"ఇది ఆయన చేపట్టిన మార్గం కాకపోవచ్చు. ఇంకెవరో ఈ కొత్త ప్రక్రియను ప్రవేశపెట్టి వుండవచ్చు. మొత్తానికి చాలా తెలివైన మార్గాన్నే ఎన్నుకున్నారు. మీరే ఆలోచించండి. ఈ ప్రదర్శనకు బదులు, మైక్ లో ఆ మందుగురించి గొంతు చించుకు అరిచినా, ఈ జనం పట్టించుకునేవారా?"

డాక్టర్ తలూపి, "నిజమే!" అన్నాడు.

సంజయ్ వాళ్ళ చర్చలో ఆసక్తి చూపడం లేదు. అతని చూపులు దీపా, ప్రేరితా కనిపిస్తారేమోనని హాలంతా కలయజూస్తున్నాయి. కాకతాళీయంగా, అదే సమయంలో అతని దృష్టి లిఫ్ట్ దిగి, హోటల్లోంచి బైటికెళ్తున్న ప్రేరితమీద పడింది!

ఆమె అటూ ఇటూ చూడకుండా, త్వరత్వరగా అడుగులు వేస్తోంది తలుపువైపు. రోజూ క్రమం తప్పకుండా, ఇక్కడికి వచ్చే ప్రేరిత ఈరోజు ఈ విచిత్ర నర్తకుల ప్రోగ్రాం వుందని తెలిసీ ఎందుకు రాలేదు? అంత హడావుడిగా ఎక్కడికెళ్తోంది?

అనుకుంటూ చటుక్కున లేచి, ఆమె ననుసరించాడు సంజయ్.

6

ప్రేరిత హోటల్లోంచి బయటపడి కారు పార్కింగ్ వైపు నడుస్తోంది.

అక్కడ అట్టే జనసంచారం లేదు. పార్కింగ్ ప్లేస్‌లో లైట్ల కాంతి ఎక్కువగా పడటంలేదు. సంజయ్ ఆమెకాస్త ఎడంగా వుండి గమనించసాగాడు.

ప్రేరిత తిన్నగా వెళ్ళి ఓ నీలిరంగు ఫియట్ కారు పక్కన నిలబడింది. అంతే మరుక్షణం మసక చీకట్లోంచి ఇద్దరు వ్యక్తులు ఆమెని సమీపించారు. క్షణంపాటు వాళ్ళ మధ్య ఏదో సంభాషణ సాగింది. అంతవరకూ మామూలుగా వున్న ప్రేరిత అకస్మాత్తుగా బెదిరిపోయినట్టు కనిపించింది.

ఆ ఇద్దర్లో ఒకడు చటుక్కున కారు డోర్ తెరిచి, ఆమెని లోనికి తోశాడు. రెండో వ్యక్తి మెరుపులా డ్రైవింగ్ సీట్లోకి దూరాడు.మరుక్షణం కారు స్టార్టయింది. హెడ్ లైట్స్ వెలిగాయి. కన్ను మూసి తెరిచేలోగా, కంపౌండ్ గేటు దాటి ఎడంవైపు తిరిగింది కారు.

చకచక చుట్టూ కలియజూశాడు సంజయ్. పార్కింగ్‌లో ఓ పక్క ఆపివున్న స్కూటర్లు కనిపించాయి. జేబులోంచి మాస్టర్ కీ తీస్తూ అటు పరిగెత్తాడు. నిమిషంలో ఓ స్కూటర్ లాక్ తీసి, స్టార్ట్ చేసి, బాణంలా గేటు దాటించి ఎడంవైపు తిప్పాడు.

ఫర్లాంగు దూరంలో కనిపించిందా ఫియట్! వాళ్ళ కనుమానం రాకుండా హెడ్ లైట్స్ ఆర్పి, వెంబడించ సాగేడు సంజయ్. కారు హిల్ రూట్ వైపు వెళుతోంది.

ఎవరు వాళ్ళు? ప్రేరితని బలవంతంగా ఎక్కడికి తీసి కెళ్తున్నారు? వాళ్ళకూ, ప్రేరితకూ ఏమిటి సంబంధం?

మొదటినించీ ఆ అమ్మాయి తీరు అంతుబట్టని క్రాస్ పజిల్లాగే వుంది!

సంజయ్ వూహించినట్టే కారు హిల్ రూట్ గుండా ఎత్తైన ప్రదేశానికి చేరుకుంది. చుట్టూ మసక చీకటి. నిర్మానుష్యం! కొండను తొలిచి నిర్మించిన రోడ్డు అది. రోడ్డుకి కుడివైపు కొండరాళ్ళూ, ఎడంవైపు లోతైన లోయా వున్నాయి.

అప్పుడే సన్నగా వర్షపుజల్లు ప్రారంభమైంది. అదే చిలికి చిలికి గాలివానగా మారిందంటే, తనకు చాలా ఇబ్బంది కలగవచ్చు. ఉన్నట్టుండి కారు హఠాత్తుగా ఆగిపోయింది రోడ్డు పక్కన. సడన్ బ్రేక్ వేసి ఆపాడు సంజయ్ స్కూటర్ని.

డ్రైవింగ్ సీటు తలుపు తెరుచుకుంది. అంతవరకూ కారు తోలిన వ్యక్తి దిగి బాయ్‌నెట్ తెరిచి ఇంజన్‌లో ఏదో చూడసాగాడు. బహుశా, ఏదో ట్రబుల్ వచ్చుంటుంది!

స్కూటర్ మీంచి దిగాడు సంజయ్. సవ్వడి కాని అడుగులు వేస్తూ చిటుతలా కారును సమీపించాడు.

"ఏం జరిగింది?" అడిగాడు బాక్ సీట్లో కూర్చున్న వ్యక్తి గట్టిగా.

"ఫ్యూయల్ అందడం లేదు. ఏర్‌లాక్ అయిందేమో?" అన్నాడు ఇంజన్ చూస్తున్న వ్యక్తి.

"త్వరగా కానివ్వు. అవతల వర్షం ఎక్కువయేట్టుంది" అన్నాడు లోపలతను.

"నా ఒక్కడివల్ల అవుతుందా? రా ఇటు!"

జేబులోంచి పిస్తోలు తీసి రెడీగా పట్టుకున్నాడు సంజయ్.

కారు బాక్ డోర్ తెరుచుకుంది. రెండో అతను దిగి, ఇంజన్ వైపు వెళ్ళాడు. పిస్తోలు సేఫ్టీ కాచ్ వెనక్కిలాగి, వేలు ట్రిగ్గర్ మీద సిద్ధంగా వుంచి, వాళ్ళవైపు నడిచాడు సంజయ్.

అడుగుల శబ్దం విని ఇద్దరూ అదిరిపడి వెనుదిరిగారు.

"కదలకండి! చేతులు పైకెత్తి అక్కడే నిల్చోండి. నా అనుమతి లేకుండా ఊపిరి తీసుకోడం తప్ప, చిటికెన వేలు కదిపినా, మీ శరీరాల్లో అనేక కిటికీలు తెరుచుకుంటాయి జాగ్రత్త!" అన్నాడు సంజయ్.

"ఎవరు నువ్వు? ఎక్కణ్నించి వచ్చావ్?" అన్నాడొకడు చేతులెత్తుతూ.

"చెబుతాను, ఓపిక పట్టు!" అని ఆ అమ్మాయి నుద్దేశించి, "ప్రేరితా! కార్లోంచి దిగు. నేను సంజయ్‌ని. వీళ్ళిప్పుడు నా చెప్పు చేతుల్లో వున్నారు" అన్నాడు.

కారు తలుపు తెరుచుకున్న శబ్దం! అవతలివైపు దిగింది ప్రేరిత. అంతే! ఆమె గావుకేకతో పరిసరాలు మారుమోగాయి.

"ప్రేరితా! ఏమైంది?" అరిచాడు సంజయ్.

నిశ్శబ్దం!

చటుక్కున వెనుదిరిగి అటు పరిగెత్తబోయాడు సంజయ్. అంతే! ఆ ఇద్దరు వ్యక్తులు లంఘించారతని మీదికి. ట్రిగర్ వత్తేశాడు సంజయ్.

"ఢాం!" దిక్కులు పిక్కటిల్లాయి.

గుండు దూసుకెళ్ళి ఓ వ్యక్తి తొడలో దిగింది. కాండం నరికిన చెట్టులా కూలాడతను. క్షణం కూడా జాగు చెయ్యకుండా బూటుకాలితో ఈడ్చి రెండో వ్యక్తి తొడల నడుమ తన్నేడు సంజయ్. గావుకేక పెడుతూ రెండు చేతులతో అక్కడ అదుముకుని, నేలకూలాడతను.

వెంటనే కారు అవతలివైపు కెళ్ళి చూశాడు సంజయ్.

ప్రేరిత లేదు!

పిల్చాడు గట్టిగా.

జవాబు లేదు.

ఆమె ఛాయలుకూడా లేవక్కడ. ఏమైంది? ఎక్కడికి కెళ్ళింది? తీవ్రంగా ఆలోచిస్తూ చుట్టూ కలయజూశాడు. కొద్ది దూరంలో నేలమీద పడుందో లేడీస్ సైండిల్! ఆమెదేనా?

అనుకుంటూ రోడ్డు పక్క లోయవైపు చూశాడు. కొంపదీసి ఆమె కారు దిగి, లోయలో ద్రొల్లిపోలేదుకదా? ఐతే, సహాయంకోసం కేకలెందుకు వెయ్యడంలేదు? ఆలోచిస్తూ గబగబ లోయలోకి దిగసాగాడు సంజయ్.

కొద్ది దూరం వెళ్ళి, "ప్రేరితా!" పిల్చేడు.

జవాబు శూన్యం.

ఇంకా స్త కిందికెళ్ళి మళ్ళీ పిల్చేడు.

నిశ్శబ్దం!

చీకట్లో ఏమీ కనిపించడం లేదక్కడ. అంతవరకూ జల్లులా పడుతున్న వర్షం అప్పుడు చినుకులుగా మారింది. మేఘాలు గర్జిస్తున్నాయి. ఆ చీకట్లో ఆమెని వెదకడం కష్టం.

రోడ్డుమీద పడున్న ఆగంతకుల దగ్గర టార్చి వుంటే తీసుకురావాలి, అనుకుంటూ అతి కష్టంమీద పైకిచేరుకుని, నిర్ఘాంతపోయాడు సంజయ్. రోడ్డుమీదుండవలసిన ఇద్దరు మనుషులూ, ఫియట్ కారూ మాయం.

తను కిందికెళ్ళగానే అదును చూసి పారిపోయారా? ప్రేరితని ఏ వుద్దేశంతో అపహరించాలనుకున్నారు? వరద రాజన్ అనే ఆ వ్యక్తిని వీళ్లే చంపారా?

ఆలోచిస్తూ స్కూటర్ వదిలిన చోటికి బైలుదేరాడు సంజయ్. కొద్దిదూరం నడిచాడో, లేదో వర్షం ఉధృతమైంది. రోడ్డుపక్క చెట్టుకిందికి పరిగెత్తాడు. కాండానికి ఒదిగి నిల్చున్నాడు.

అంతలో ఎవ్వరో వస్తున్న అడుగుల శబ్దం వినిపించి, అతని చెవులు అప్రయత్నంగా నిక్కబొడుచుకున్నాయి. అంత వర్షంలో, చీకట్లో ఓ ఆకారం తనవైపే వస్తూ కనిపించింది లీలగా. ఊపిరి బిగబట్టి కన్నార్పకుండా అటే చూడసాగాడు.

7

ఆకారం దగ్గరవుతున్నకొద్దీ బూట్సుల శబ్దం స్పష్టంగా వినిపించసాగింది. అతనికి పదిగజాల దూరంలో ఆగిపోయాడతను. మరుక్షణం ఆ వ్యక్తి చేతిలో టార్చిలైటు వెలిగింది.

"ఏయ్, ఎవరు నువ్? ఇక్కడేం చేస్తున్నావ్?"

"కనిపించడంలా? మనిషిని, అందుకే నీలా వర్షంలో తడవదలచుకోలేదు."

"తలతిక్కగా మాట్లాడక! ఇంత రాత్రి ఇక్కడికెలా వచ్చావ్?"

"అడగడానికి నువ్వెవరు?"

"నాకు తలతిక్క జవాబులు గిట్టవని మళ్ళీ చెబుతున్నాను" అంటూ కుడిచెయ్యి వెలుగులోకి చాచాడతను.

అప్పుడు పడింది సంజయ్ దృష్టి, ఆ చేతిలో వున్న పిస్తోలుమీద! "ఓహో, పిస్తోలా! ఏదీ, ఇలా ఇవ్వు చూద్దాం. సినిమాల్లో చూడ్డమే తప్ప, ఇంతవరకూ చేత్తో తాకి ఎరగను!"

"ఇది సినిమాల్లో చూపే పిస్తోలు కాదురా బదుద్ధాయ్

నిజం పిస్తోలు...బుద్ధిగా నా ప్రశ్నలకి జవాబులిచ్చావా సరి. లేదా, ఇక్కడే హరీమంటావ్!''

''అలాగా? ఐతే, పదికి మించి ప్రశ్నలు వెయ్యక. అందులో, నాకు నచ్చిన ఐదింటికే జవాబులిస్తాను.''

''నేను ఫైర్ చెయ్యబోతున్నాను జాగ్రత్త.''

''నా కభ్యంతరం లేదుగానీ, త్వరగా వచ్చెయ్యాలి! ఈ చీకట్లో చచ్చే భయం వేస్తోంది నాకు.''

''రాస్కెల్! చూడు నిన్నేం చేస్తానో...'' అంటూ అడుగు ముందుకు వేశాడతను. అంతే! స్ప్రింగులా ఎగిరాడు సంజయ్ గాలిలోకి. మరుక్షణం అతని రెండు కాళ్ళు ఆ వ్యక్తి ఛాతీని ముద్దెట్టుకున్నాయి. ఇద్దరూ అమాంతం నేల కూలారు.

సంజయ్ మెరుపులా లేచి, ''ఇప్పుడు నేను వేసే ఇరవై ప్రశ్నలకి జవాబులివ్వాలి నువ్వు!'' అన్నాడు ఛాతీ మీద కాలు పెట్టి అదుముతూ.

ఆ వ్యక్తి లేవడానికి శాయశక్తులా ప్రయత్నించి విఫలుడయ్యాడు.

''అలా పడుకునే చెప్పు, ఎవరు నువ్వు?''

''సి.ఐ.డి. ఆఫీసర్ని!''

''ఐతే, నిన్నా పరబ్రహ్మకూడా ఇక కాపాడలేడు. ప్రభుత్వ డిటెక్టివ్ అంటే నాకు వళ్ళు మంట. బహుశా, నువ్వు నన్ను వెంబడిస్తూ వచ్చుంటావు. పోలీసుల్ని ముప్పు తిప్పలు పెట్టి. మూడు చెరువుల నీళ్ళు తాగించడం నా రివాజు!''

''న్...నేను పోలీసాఫీసర్ని కాను.''

''లాభంలేదు. ఇప్పుడు అరిచి గీపెట్టినా నేన్నమ్మను.''

''ఐతే నువ్వు పరాయి సొత్తు స్వాహాచేసే బాపతన్న

మాట."

"పరాయిసొత్తెప్పుడూ నాకోసం ఎదురు చూస్తుం టుంది. నా అడుగుల శబ్దం వినగానే, ఇనప్పెట్టెలు వాటంతటవే తెరుచుకుంటాయి."

"ఐతే మనిద్దరం ఒకేజాతి పక్షులం! పోలీసాఫీసర్నని పూరికే బొంకాను. నీలాంటి వాణ్ని నేనింతవరకూ చూళ్లేదు. కన్ను మూసి తెరిచేలోగా నన్నూ, నా ఆయుధాన్నీ నిర్వీర్యుల్ని చేశావ్. ఇప్పుడైనా క్షమించి కాలు తీసి పుణ్యంకట్టుకో."

సంజయ్ వంగి, కొద్దిదూరంలో పడున్న టార్చిలైటూ పిస్తోలూ అందుకున్నాడు. అప్పుడు తట్టిందతనికి సడన్ గా ఓ ఆలోచన.

పిస్తోలు ఆ వ్యక్తి బుర్రకి గురిపెట్టి, "నా ప్రశ్నలకి సరైన జవాబులిచ్చేదాకా నీకీ నరకం తప్పదు. ఏమాత్రం బొంకావా నీ పిస్తోలు గుళ్లే నిన్ను వైకుంఠం పంపేస్తాయి జాగ్రత్త! ప్రేరిత అనే అమ్మాయిని ఫియట్ కార్లో కిడ్నాప్ చేసినవాళ్ళు నీ అనుచరులేకదూ?" అడిగాడు.

అతను పలకలేదు.

బూటుకాలితో గట్టిగా నొక్కాడు సంజయ్. "చెప్పు లేదా బూటుతో నీ గుండె అప్పడం చేస్తాను."

"ఔను. వాళ్ళు మనిషినే!"

"ప్రేరితనెందుకపహరించారు?"

"ఆమెనపహరించడానికి మొత్తం నలుగురం నియమించబడ్డాం! అందులో ఇద్దరు హోటల్ నించి ఆమెని తీసుకురావడానికెళ్ళారు. వాళ్ళు రావలసింది ఈ రూట్ లోనే గనక, మధ్యలో వాళ్ళకేదైనా ఆపద ముంచుకొస్తే ఆదుకోడానికి మిగతా ఇద్దరం అక్కడక్కడా నియమించబడ్డాం.

ఆమె నపహరించుకొస్తే పదివేలు ముట్టచెబుతా నన్నాడో వ్యక్తి...కాకతాళీయంగా కారిక్కడే చెడి పోయింది. వాళ్ళు కారుదిగి ఇంజన్ చూస్తుండగా నువ్వు వెనకనించి వచ్చి, వాళ్ళని పిస్తోలుతో బెదిరించావ్. నేను చీకట్లో నక్కి ఇదంతా చూస్తూనే వున్నాను.

ఆ అమ్మాయి అవతలిపక్క కారు దిగగానే, అక్కడ పొంచివున్న నేను ఆమె నెత్తుకుపోయి, వో గుహలో బంధించి, మిగతా అనుచరుల్ని వెదుక్కుంటూ ఇటొస్తే నువ్వు కనిపించావ్!"

"ఐతే, మీరు స్థానిక రౌడీలన్న మాట! ఆమె నెత్తుకురావడానికి మిమ్మల్ని నియమించిన వ్యక్తి ఎవరు?"

"తెలీదు. అతను మా దగ్గరికి వచ్చినప్పుడు మొహానికి ముసుగు వేసుకున్నాడు. మాక్కావలసింది డబ్బు. అత నెవ్వరయితే ఏం?"

"ఇప్పుడా అమ్మాయి ఎక్కడుంది?"

"ఇక్కణ్నించి ఫర్లాంగు దూరంలోవున్న గుహలో."

"వెంటనే ఆమెని నా కప్పగించు."

"పది వేలకోసం ఇన్ని అవస్థలు పడ్డాం! ఆ డబ్బిచ్చి ఆలాగే తీసికెళ్ళు."

సంజయ్ నవ్వి—"ఇటువంటి బేరాలు భోళారాయు ళ్ళతో జరపాలి. బుద్ధిగా ఆమె నెక్కడ బంధించావో చూపెట్టకుంటే ఒళ్ళు హూనం చేస్తాను జాగ్రత్త!" అన్నాడు బూటుతో గట్టిగా అదుముతూ.

"చ్...చూపెడతాను. కాలు తియ్యి!" అన్నా డతను మూలుగుతూ.

పిస్తోలు సిద్ధంగా పట్టుకుని, ఛాతీమీంచి కాలు తీశాడు సంజయ్.

అతి కష్టంమీద లేచి నిల్చోగలిగాడతను. అంతవరకూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం ఇప్పుడు తగ్గుముఖం పట్టింది. అతను వెనుదిరిగి కదిలాడు ముందుకు. సంజయ్ వెనక వుండి, టార్చి వెలిగించి అతనికి దారి చూపిస్తున్నాడు.

రోడ్డు కడ్డంగా పొదల్లోపడి ఫర్లాంగు దూరం నడిచేక వో చోట ఆగాడతను. ఎదురుగా వో గుహ కనిపిస్తోంది.

"నడు లోపలికి" అన్నాడు సంజయ్.

ఇద్దరూ లోన అడుగుపెట్టారు. వో మూల తాళ్ళతో కట్టిపడేసి వుంది ప్రేరిత. అరవకుండా ఆమె నోట్లో గుడ్డలు కుక్కి వున్నాయి.

"ఆమె కట్లు విప్పేయ్!"

అతను కింద కూర్చుని గబగబ కట్లువిప్పాడు.

"సంజయ్ గారూ" అంది ప్రేరిత పూడుకుపోయిన కంఠంతో.

"మనం తరవాత మాట్లాడుకోవచ్చు. ముందిలావచ్చి, ఈ పిస్తోలుతో వాణ్ని కవర్ చేస్తూ నిల్చో!" అన్నాడు సంజయ్.

ప్రేరిత అతన్ని సమీపించి, పిస్తోలూ - టార్చిలైటూ అందుకుంది.

సంజయ్ లేవబోతున్న ఆ వ్యక్తిని కిందికితోసి ఆ తాళ్ళతోనే అతని కాళ్ళూ చేతులూ కట్టిపడేశాడు.

తరవాత ప్రేరిత చేతిలోంచి పిస్తోలందుకుని, "కమాన్!" అంటూ గుహ బైటకి నడిచాడు.

ఇద్దరూ చకచక అడుగులు వేస్తూ రోడ్డువెపు నడక సాగించారు.

"ఈ నిశిరాత్రిలో అంతదూరం కాలినడకన వెళ్ళక తప్పదంటారా?" అంది ప్రేరిత భయంగా.

"రోడ్డుమీద నేను వచ్చిన స్కూటర్ వుంది. ఇంతకీ, నువ్వా హోటల్లోంచి కార్ పార్కింగ్ దగ్గరికెందు కెళ్ళావ్?"

"గదిలో వున్న నాకు బట్లర్ ద్వారా ఎవ్వరో వో ఉత్తరం పంపించారు. అందులో, నేను వెంటనే కారు పార్కింగ్ దగ్గరికివస్తే, ఇంతకాలం ఏ రహస్యాన్నైతే కనుక్కోడానికి నేను ఆరాటపడుతున్నానో అది తెలుసుకోవచ్చని రాసుంది. నేనింకేమీ ఆలోచించకుండా వెళ్ళానక్కడికి. ఆ దుండగులిలా చేస్తారని ఊహించ లేదు!"

"ఏమిటా రహస్యం?"

"నా జన్మ రహస్యం."

"వాట్?"

"ఔను. నా తలిదండ్రులెవ్వరో, ఇంతకాలం నా అవసరాలకి డబ్బు ఎక్కణ్ణించి వస్తోందో, ఎవ్వరుపంపుతున్నారో తెలుసుకోవాలని ఎన్నాళ్ళుగానో ప్రయత్నిస్తున్నాను. ఇంతవరకూ ఏమీ అంతు బట్టలేదు."

"బాల్యంనించి నువ్వెక్కడ పెరిగావ్?"

"ఒక వృద్ధురాలి ప్రాపకంలో!"

"నీ తలిదండ్రులెవరో ఆమె చెప్పలేదా నీకు?"

"లేదు."

"ఎందుకు?

"ఆమె మూగది కనుక!"

"అయితే, నువ్వామె దగ్గరికెక్కణ్ణించి వచ్చావు?"

"మూగది, చదువురానిది ఎలా చెప్పగలుగుతుంది? అంతేకాదు, ఇరుగు పొరుగు వాళ్ళుకూడా తెలీదుట నేనామె దగ్గరికెలా వచ్చానో?"

"ఇప్పుడా ముసలామె ఎక్కడుంది?"

"చనిపోయింది! ఆరేళ్ళక్రితం."

"ఆ తరవాత కూడా నువ్వక్కడే వున్నావా?"

"ఔను. ఆమె మరణించిన కొద్దిరోజులకు, ఓ తల నెరిసిన వ్యక్తివచ్చి, తనా ముసలామె సోదరుణ్ణని పరిచయం చేసుకున్నాడు."

"నువ్వామె దగ్గరికెలా వచ్చావో అతనుకూడా చెప్పలేదా?"

"ఎంత ప్రయత్నించినా చెప్పేవాడుకాదు. అతనామె సోదరుడు కాడని ఎందుకో నా కనుమానం వేస్తుండేది"

"కారణం?"

"ఆ ముసలామె చాలా పేదది. జీర్ణావస్థలోవుండే ఇంట్లో నివసించేది. అతనుమాత్రం పచ్చగా బ్రతుకుతున్న గొప్పింటి వ్యక్తిలా కనిపించేవాడు. అదీగాక ఆమె బ్రతికుండగా ఎన్నడూ ఆ ఛాయలకు రానివ్యక్తి, కనీసం ఆమె అంత్యక్రియలకూ్కడా రానివ్యక్తి. వున్నట్టుండి ఎక్కణ్ణించి ఊడిపడ్డాడు?

ఆమె మరణానంతరం అతనే నా బాగోగులు చూసిపోతుండేవాడు. జీర్ణదశలోవున్న ఆ ఇంటికి మరమ్మత్తులు చేయించి, ఆధునికంగా మార్చేశాడు. అయితే, వచ్చినప్పుడల్లా నేనీ లోకంలో ఏ దిక్కూలేని అనాథబాలికనన్న భావం వచ్చేలా పదేపదే మాట్లాడేవాడు."

"ఇప్పుడతనెక్కడున్నాడు?"

"తెలీదు! అడపాదడపా వచ్చి నన్నుచూసి పోయే వ్యక్తి రెండేళ్ళక్రితం హఠాత్తుగా రావడం మానేశాడు. ఎక్కడున్నాడో? ఎలా వున్నాడో? కనీసం బ్రతికివున్నాడో? చనిపోయాడోకూడా నాకు తెలీదు!"

"నీకథ చాలా విచిత్రంగా వుంది. ఈ రెండేళ్ళుగా నీ అవసరాలకి డబ్బెక్కణ్నించి వస్తోంది?"

"అదీ ఒక విచిత్రమే! ప్రతినెలా మూడవ తేదీన ఐదువందలకు చెక్కు వచ్చేస్తుంది నా పేర. హాయిగా, నిశ్చింతగా గడిచిపోతున్నాయి రోజులు. అయితే, ఆ చెక్కు ఎక్కణ్నించి వస్తుందో, ఎవరు పంపిస్తున్నారో ఇంతవరకూ అంతుబట్టలేదు. చెక్కుమీద సంతకంకూడా అర్థంకాకుండా వుంటుంది."

"బ్యాంకులో కనుక్కుంటే ఆ వివరాలన్నీ తెలిసిపోతాయి కదా?"

"ప్రయత్నించాను. లాభంలేకపోయింది."

"హోటల్లో హత్యచేయబడ్డ వరదరాజన్ ఎవరు?"

"నా శ్రేయోభిలాషి, ఆత్మీయుడు. నా కథంతావిని నాతోబాటు రహస్యం కనుక్కోడానికి తీవ్రప్రయత్నాలు చెయ్యసాగాడు. ఈమధ్య హోటల్లో మీరు నాకు పరిచయమైనప్పుడు, మనిద్దరం తరచూ కలుసుకోడం చూసి, సహించక నన్నూ, మిమ్మల్నీ హెచ్చరించాడు. నాకోసం అంత దారుణంగా అతని హత్య జరుగుతుందని నేను ఊహించలేదు."

సంజయ్ పలకలేదు. అప్పటికే రోడ్డుప్రక్క ఆపివున్న స్కూటర్ని సమీపించారిద్దరూ. కొద్ది ప్రయాసతో దాన్ని స్టార్ట్ చేసి, ప్రేరితను వెనక కూర్చోబెట్టుకొని, బాణంలా ముందుకు పోనిచ్చాడు సంజయ్.

8

హోటల్‌కు చాలాదూరంలో స్కూటరాపేసి దిగారిద్దరూ.

అక్కణ్నించి ఫర్లాంగుదూరం నడిస్తే హోటల్ చేరు

కోవచ్చు. ఇప్పుడు వర్షం పూర్తిగా స్తంభించింది. ఇద్దరూ గబగబ అడుగులు వేస్తూ హోటల్లో ప్రవేశించారు.

చిన్నసైజు జాతరలా వుందక్కడ. ఎర్రటోపీలు అటు యిటూ తిరుగుతున్నాయి. క్రితంరోజు వచ్చిన యిన్స్పెక్టరే మళ్ళీ కనిపించాడు మేనేజర్తో మాట్లాడుతూ.

సంజయ్ని చూడగానే, "మిస్టర్ యిలారండి" అన్నాడు.

అడుగులో అడుగు వేసుకుంటూ అతన్ని సమీపించి కనుబొమలెగరేశాడు సంజయ్.

"అనుమతి లేకుండా ఎక్కడికీ వెళ్ళొద్దని చెప్పాగా! ఇంతసేపూ ఎక్కడున్నారు?" గుర్రుమన్నాడు ఇన్స్పెక్టర్.

"మీ అనుమతి లేకుండా ఈ ఊరొదిలి వెళ్ళొద్దు అన్నారుగానీ, హోటల్ బయట షికారుక్కూడా వెళ్ళ వద్దనలేదు. జ్ఞాపకం చేసుకోండి."

"ఐతే, ఇంతరాత్రి ఈ కుండపోత వర్షంలో షికారు కెళ్ళొస్తున్నారన్న మాట."

"షికారుకని వెళ్ళాను. మధ్యలో వర్షం వచ్చింది. ఓచోట తలదాచుకుంటూ వుండిపోయాను."

"పార్కింగ్లో ఆపివున్న ఓ ఫియట్ కారూ, స్కూటరూ దొంగిలించబడ్డాయి. దీనికేమంటారు?"

"నాకు స్కూటరూ, కారూ నడపడం అటుంచి, సైకిల్ కూడా తొక్కడం చేతకాదు."

"ఐసీ, రిపోర్టందాక మేమువచ్చి చూస్తే మీ స్నేహితుడు కూడా లేడు హోటల్లో. ఆయనకూడా షికారుకు వెళ్ళాడా?"

"తెలీదు! అయినా అతను మైనర్ బాబు కాదుకదా, కనిపెట్టుకునుండడానికి."

"మనిషిలా మర్యాదగా మాట్లాడ్డం నేర్చుకోండి!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ గుర్రుమంటూ.

"అయితే నేనింతవరకూ ఊరపిచుకలా కిచకిచమన్నానా?" అడిగాడు సంజయ్ ఆశ్చర్యంగా.

"తెలుస్తుంది. త్వరలోనే తెలుస్తుంది" బుసలుకొడ్తూ అక్కణ్ణించి వెళ్ళిపోయాడు ఇన్‌స్పెక్టర్.

సంజయ్ నవ్వుతూ ప్రేరితని వెంటబెట్టుకుని లిఫ్ట్‌లో పైకి చేరుకున్నాడు. వాళ్ళగది తలుపు మూసుంది. సంజయ్ తన దగ్గరున్న తాళంచెవితో డోర్‌లాక్ తెరిచాడు.

ఇద్దరూ లోన అడుగుపెట్టారు.

సంజయ్ బ్రీఫ్‌కేసులోంచి డైరీతీసి, "ప్రేరితా, నీకు ప్రతినెలా ఓ అజ్ఞాత చెక్కు వస్తుందన్నావు కదూ? ఏ బ్యాంకు చెక్కది?" అడిగాడు.

"కెనరా బ్యాంకు."

"ఏ బ్రాంచి?"

"తంబుచెట్టి స్ట్రీట్, మద్రాసు."

"అకౌంట్ నెంబరు?"

"1252. లెడ్జర్ పోలియో 204."

"నీ దగ్గర లేడీ పిస్తోలున్నమాట నిజమేనా?"

"ఔను. మీకెలా తెలుసు?"

"లైసెన్సుందా దానికి?"

"ఉంది! వరదరాజనే దాన్ని కొనిచ్చాడు నాకు, ఆత్మరక్షణ కోసం!"

"మంచిపని చేశాడు. జరిగిన సంఘటనలను బట్టి, నిజంగా నిన్నేదో ప్రమాదం అంటిపెట్టుకున్నట్టు స్పష్టమౌతోంది. నిన్ను కిడ్నాప్ చేసి, ఆ వ్యక్తి ఏం చెయ్యాదలచుకున్నాడో తెలీదు.

ఆ ప్రయత్నం ఇప్పుడు ఫలించలేదు గనక, త్వరలో మరో ప్రయత్నం చెయ్యొచ్చు. ఆ పిస్తోలు యెప్పుడూ నీ దగ్గర సిద్ధంగా వుంచుకోవాలి. అవసరం వస్తే కాల్చి పారెయ్యడానికి సందేహించక'' ఇంకా సంజయ్ మాట పూర్తికాలేదు.

తలుపు తోసుకుంటూ లోనికి వచ్చాడు డిటెక్టివ్ ఉత్తమ్ కుమార్. అతని బట్టలన్నీ తడిసివున్నాయి.

''ఆ డాక్టర్ తో నేను మాట్లాడుతున్నప్పుడు చెప్పా చెయ్యకుండా ఎక్కడికెళ్ళావ్? తరవాత నీకోసం హోటల్ అంతా గాలించాను. ఎక్కడా కనిపించక పోయేసరికి ఖంగారుపడి టాక్సీలో సిటీ అంతా తిరిగొచ్చాను.

హోటల్లో ప్రవేశించగానే యిన్ స్పెక్టర్ యెదురయ్యాడు. అతని యక్షప్రశ్నలకి జవాబులిచ్చి, వదిలించుకునే సరికి తలప్రాణం తోకకొచ్చింది. ఇంతకీ యెక్కడికెళ్ళావ్ నువ్వు?'' అడిగాడు సంజయ్ ని.

ప్రేరితని అతనికి పరిచయంచేసి, జరిగిందంతా పూస గుచ్చినట్టు వివరించాడు సంజయ్.

ఉత్తమ్ కుమార్ సాలోచనగా తలూపి, ''వెంటనే మద్రాసు క్రయింబ్రాంచి హెడ్ క్వార్టర్స్ కు ట్రంకాల్ చేసి, మన ఫ్రెండ్ ఇన్ స్పెక్టర్ రాజారెడ్డికి ఆ కెనరా బ్యాంకు వివరాలు చెప్పి, ఆ అకౌంట్ ఎవరిపేర వుందో కనుక్కుని తెలీజెయ్యమను.

ప్రేరితా! ఈ కేసు ముగిసేవరకూ నువ్వు మాతోబాటు ఇక్కడే వుండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ గదిదాటి బైటికెళ్ళకూడదు'' అన్నాడు.

సంజయ్ టీపాయ్ మీది టెలిఫోన్ ముందుకు లాక్కు

న్నాడు. రిసీవర్ ఎత్తి, వెంటనే మద్రాసు క్రయిం బ్రాంచికి ట్రంకాల్ చెయ్యమన్నాడు హోటల్ ఆపరేటర్‌తో.

అరగంట తరవాత దొరికింది లైను.

"ఇటీజ్ క్రయిం బ్రాంచి స్పీకింగ్!" వినిపించింది అవతలినుంచి.

"నేను డిటెక్టివ్ ఉత్తమకుమార్ అసిస్టెంట్ సంజయ్‌ని. ఊటీనుంచి మాట్లాడుతున్నాను. ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డిగారున్నారా అక్కడ?"

"లేరు సార్! ఇప్పుడే ఇంటికెళ్ళారు. నేను సార్జంట్ డేవిడ్‌ని మాట్లాడుతున్నాను. ఏదయినా మెసేజివ్వాలా ఆయనకు?"

"అవును" అంటూ కెనరాబ్యాంకు వివరాలూ, అకౌంటు నెంబరూ అదీ చెప్పి, రేపు బ్యాంకుకెళ్ళి, ఆ అకౌంటు ఎవరిపేర వుందో కనుక్కుని తమకి తెలీజెయ్యమని చెప్పాడు సంజయ్.

"ఓ. కే. సార్" అవతల క్లిక్ మంది.

9

మర్నాడు మధ్యాహ్నం ఒంటిగంటకు మోగిందిఫోన్.

డిటెక్టివ్‌లిద్దరూ ఆ ఫోన్ కాల్ కోసమే యెదురు చూస్తున్నారు, గదిలోంచి ఎక్కడికీ వెళ్ళకుండా.

సంజయ్ రిసీవరందుకుని, కాసేపు మాట్లాడి, "థాంక్స్ మెనీ థాంక్స్!" అంటూ క్రెడిల్ చేశాడు రిసీవర్ని.

"ఇన్‌స్పెక్టరేనా?" అడిగాడు ఉత్తమకుమార్.

"అవును. బ్యాంకుకెళ్ళి కనుక్కున్నాడట. ఆ అకౌంటు డాక్టర్ పీతాంబరం అనే వ్యక్తిపేర వుందట. ప్రేరిత నడిగి తెలుసుకోవాలి" అంటూ పక్కగదిలోకెళ్ళి రెండు నిముషాల తర్వాత తిరిగి వచ్చాడు సంజయ్.

“ఇన్నాళ్ళూ ఆమె బాగోగులు చూస్తూ, హఠాత్తుగా అదృశ్యమైపోయిన వ్యక్తి పేరే పీతాంబరమట. అయితే, అతను డాక్టర్ అని ప్రేరితకు తెలీదట.”

ఉత్తమ్‌కుమార్ పలకలేదు. సిగరెట్ అంటించి, తీవ్రంగా ఆలోచిస్తూండి పోయాడు. రెండు గంటలకు ఇద్దరూ లేచి, కింద డైనింగ్ హాల్లోకెళ్ళారు భోజనం చెయ్యడానికి. ప్రేరితకు ఏం కావలసినా రిసెప్షన్‌కు ఫోన్ చేసి గదికే తెప్పించుకుంటోంది.

డిటెక్టివ్ ద్వయం భోజనాని ఉపక్రమిస్తూండగా, హోటల్ సిబ్బంది ఆ ఆరుగురు విచిత్ర నర్తకుల్ని చక్రాల కుర్చీల్లో తోసుకుంటూ తీసుకొచ్చారక్కడికి. డైనింగ్ టేబులు దగ్గరకి జరపబడ్డాయి వాళ్ళకుర్చీలు. ఐదు నిముషాల తరవాత వాళ్ళముందు భోజన పదార్థాలు అమర్చబడ్డాయి.

అందరిలా ఆ నర్తకులు తమ స్వహస్తాలతో భోజనం చేయడంలేదు. వాళ్ళతో వచ్చిన బట్లర్లే తినిపిస్తున్నారు వాళ్ళకు. వాళ్ళ వెంట సూటుబూటులోవున్న ఓ యువకుడు కూడా వున్నాడు. అతనే వాళ్ళకు ఆదేశాలిస్తున్నాడు. బహుశా, ఆ నర్తకుల్ని పర్యవేక్షించేది అతనే కాబోలు.

బట్లరతన్ని 'మధుబాబూ' అని గౌరవంగా సంబోధిస్తున్నారు.

“అటువంటి స్థితిలోవున్న నర్తకుల్ని అంత ప్రయాస పడి ఇంతదూరం తీసుకొచ్చే బదులు, వారిగదుల్లోనే భోజనం ఏర్పాటు చెయ్యవచ్చుకదా?” అన్నాడు సంజయ్ తగ్గుస్వరంలో.

ఉత్తమ్‌కుమార్ నవ్వి, “వాళ్ళు ఎనర్జీన్ మందు పట్ల

సిటీ కోసం వాడుకోబడుతున్నారని మర్చిపోక! పాపం వాళ్లు తమ స్వహస్తాలతో సుతం భోంచేయలేనంత బలహీనంగా వున్నారని జనానికెలా తెలియాలి? అదుగో, ఆ మధుబాబు అనే యువకుడే ఆ నర్తకుల ఇన్‌స్ట్రక్టర్ లాగా కనిపిస్తున్నాడు. అతన్ని పరిచయం చేసుకొని కాసేపు మాట్లాడాలి'' అన్నాడు.

భోజనాలయ్యాక, నాప్‌కిన్‌తో మొహంతుడుచుకొని లేచాడు ఉత్తమకుమార్. ఆ యువకుడి దగ్గరికెళ్ళి పలకరింపుగా నవ్వాడు. అతనూ కలుపుగోలు మనిషిలా నవ్వుతూ పలకరించాడు. అతన్ని కాఫీకి ఆహ్వానించాడు ఉత్తమకుమార్.

ఇద్దరూ ఓ టేబిల్ ముందు కూర్చుని పిచ్చాపాటీలోకి దిగారు. ''మీ నర్తకులెప్పుడూ ఈ స్థితిలో యెందుకుంటారు? వీళ్ళ జబ్బులేమిటో కనుక్కొని వైద్యం ఇప్పించకూడదా?'' అడిగాడు ఉత్తమకుమార్.

మధుబాబు నవ్వి, ''వీళ్ళజబ్బులు నయమైతే, మనలా ఆరోగ్యవంతులయితే,వీళ్ళఅవసరం మాకెందుకు చెప్పండి? అందుకే వీళ్ళ ట్రీట్‌మెంటు గురించి మేమిప్పుడప్పుడే ఆలోచించ దలచుకోలేదు.

వీళ్లు ప్రస్తుతం ఎనర్జిన్ మందు పబ్లిసిటీకోసం పని చేస్తున్న వుద్యోగులు. ఎప్పుడయితే ఆ మందు ప్రజల మనసుల్లో పూర్తి ప్రభావాన్ని సంతరించుకొంటుందో అప్పుడే వీళ్ళ స్థితినుంచి విముక్తులయ్యేది.'' అన్నాడు.

''ఇది చాలా ఘోరం కదా? బహుశా నేరంకూడా అనుకుంటాను.''

అతను పెద్దగా నవ్వి,''కాదు, కాదు. ముమ్మాటికీకాదు. ఆ విధంగా వీళ్ళచేత అగ్రిమెంటు కుదుర్చుకోబడింది.

ప్రతిఫలంగా వీళ్ళకు పెద్ద మొత్తాలలో జీతాలివ్వబడతాయి. పబ్లిసిటీ పూర్తయ్యేక, ఎనర్జిన్ మందు వీళ్ళకు పూర్తిడోస్ ఇవ్వబడుతుంది.

అలా కొద్ది రోజుల్లోనే వీళ్ళు మనకన్నా బలాఢ్యులై పోతారు. ఇందుకు ఆరోగ్యమంత్రిత్వ శాఖనించి ముందే అనుమతి తీసుకున్నారు ప్రొఫెసర్ విష్ణువర్ధన్! వేరొకరికైతే ప్రభుత్వం ఈ ప్రక్రియకు అనుమతి ఇచ్చేదికాదు. ప్రొఫెసర్ విష్ణువర్ధన్ గారి పట్లా, ఆయన పరిశోధనల పట్లా ప్రభుత్వానికి పూర్తి నమ్మకం వుంది. ఇదివరకు ఆయన కనిపెట్టిన మందులన్నీ వైద్యరంగంలో అనేక సత్ఫలితాలనిచ్చాయి'' అన్నాడు.

''అటువంటి మహా వ్యక్తిని ప్రత్యక్షంగా చూడటం అటుంచి, కనీసం ఫోటోకూడా చూసే భాగ్యం నాకు దక్కలేదు. ఇంతకీ, ఆయనెక్కడుంటున్నారిప్పుడు?'' అడిగాడు ఉత్తమకుమార్ కుతూహలంగా.

''అది మీరడక్కూడదు. నేను చెప్పకూడదు. వ్యక్తి పూజ అంటే ఆయనకు గిట్టదు. ఈ సృష్టిలో ప్రతి వస్తువూ, ప్రతి ప్రాణీ ఏదో ఒక రూపంలో ఎదటి ప్రాణికి సేవ చేస్తోందనీ, అది సృష్టి నైజమనీ, మానవ కళ్యాణానికి ఏదో ఒరగబెడుతున్నానని తనను అందలమెక్కించడం తగదనీ ఆయన అభిప్రాయం!

నిర్జీవమైన రాళ్ళు మనిషి అవసరాలు తీర్చడంలేదా? జంతువులూ, పక్షులూ మనిషి కుపయోగపడటంలేదా? అంతెందుకు, ప్రాణాపాయకరమైన పాము విషంకూడా మందులకు పనికిరావడం లేదా? అలాగే, తనూ అందరికీ ఈ విధంగా వుపయోగపడుతున్నానని ఆయన వాదం.

ఆయన సౌమ్యస్వభావి. మితభాషి. ఏకాంతాపేక్షుడు.

తన ప్రయోగాలు తప్ప, బయట ప్రపంచంతో సంపర్కం పెట్టుకోడం ఆయన కిష్టం వుండదు.

ఉత్తమ్‌కుమార్ ఏదో అడగబోతుండగా, అదే సమయంలో ఓ బట్లర్ వచ్చి, "సార్! వాళ్ళు తమ గదుల కెళ్ళి విశ్రాంతి తీసుకోదలుస్తున్నారు!" అన్నాడు మధుబాబుతో.

అతను లేచి, "సారీ! వస్తాను" అంటూ డిటెక్టివ్ దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

మధుబాబుతో జరిగిన సంభాషణ సంజయ్‌కు వివరిస్తూ లిఫ్ట్‌లో తమ గదికి చేరుకున్నాడు ఉత్తమ్‌కుమార్.

ఆ సాయంత్రం ఇద్దరూ తయారై బాల్‌రూంలో ఏదైనా కొత్త ప్రోగ్రాం జరుగుతుందేమో చూద్దామని కిందికి వచ్చారు.

అప్పటికే లైట్ల కాంతిలో దేదీప్యమానంగా వెలిగి పోతోంది హాలు. రోజూ యువతీయువకులతో క్రిక్కిరిసి వుండే టేబిళ్ళు ఈనాడు, వయసు మళ్ళిన వాళ్ళతో కిట కిటలాడుతున్నాయి.

స్టేజిమీద వుండవలసిన ఆర్కెస్ట్రాకు బదులు పిలక జుట్టూ, పంగనామాల శాస్త్రులుగారు ఆసీనులై, పళ్ళ మధ్య కిళ్ళీ నుబ్బుతూ, భూతద్దం కళ్ళద్దాల్లోంచి ప్రేక్షకుల్ని వీక్షిస్తున్నాడు. ఆయన కిరుపక్కలా సితార్, మృదంగ వాద్యగాళ్ళు!

"హతోస్మి! ఈరోజు శాస్త్రీయ సంగీత కచేరీ ఏర్పాటు చేశారన్నమాట. అందుకే ఎన్నడూ ఈ ఛాయ లకి రాని వృద్ధజంబుకాలన్నీ ఈ రోజిక్కడ దర్శన మిస్తున్నాయి. పోదామా?" అడిగాడు సంజయ్ నీర సంగా.

"కాసేపు కూర్చో, చూద్దాం!" అన్నాడు ఉత్తమ్ కుమార్ ఓ కుర్చీలో చతికిలబడి.

"రెండు సారిడన్ మాత్రలు కొనుక్కొస్తాను." అంటూ బయటకు వెళ్ళాడు సంజయ్.

ఉత్తమ్‌కుమార్ చిన్నగా నవ్వుకున్నాడు.

సంజయ్ అరగంట తర్వాత తిరిగివచ్చాడు. ఉత్తమ్ కుమార్ కూర్చున్నవైపు చూశాడు. అతని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

కారణం, గుర్తు తెలియని ఇద్దరు అపరిచితులు. ఉత్తమ్ కుమార్ భుజాలమీద చేతులు వేసి, నడిపించుకుంటూ హోటల్లోంచి బయటికి తీసికెళ్తున్నారు. ఆయన టైఫాయిడ్ రోగిలా నీరసంగా అడుగులు వేస్తూ వెళుతున్నాడు వాళ్ళ వెంట.

ఎవరువాళ్ళు? అంతవరకూ యెంతో చలాకీగావున్న ఉత్తమ్‌కుమార్ అంత నీరసంగా ఎలా మారారు? గబ గబ అటు నడిచాడు సంజయ్.

అప్పటికే వాళ్ళు ఉత్తమ్‌కుమార్ని నడిపించుకుంటూ ద్వారం దాటారు. బయట అడుగుపెట్టి, కీనీడలో నిల్చుని చూశాడు సంజయ్. ముగ్గురూ కాంపౌండ్ గేటుదాటి, ఎడంవైపు తిరిగారు.

చకచక అడుగులువేస్తూ అటు నడిచాడు సంజయ్. గేటుమాటున నక్కి ఎడంవైపు చూశాడు. అక్కడికి కొద్దిదూరంలో ఓ లారీ ఆగివుంది. అటు నడుస్తున్నారు వాళ్ళు. లారీ ఎక్కుతారా?

కీనీడలో కంపౌండ్ గోడ కతుక్కుంటూ అటు నడిచాడు సంజయ్. అతనూహించినట్టే, వాళ్లు ఉత్తమ్ కుమార్‌తో లారీ కేబిన్ తలుపు తెరుచుకుని ఎక్కారు. మరుక్షణం ఇంజన్ స్టార్టయిన చప్పుడయింది.

మెరుపుగా అటు పరుగుతీశాడు సంజయ్. కన్ను మూసి తెరిచేలోగా లారీవెనక బాడీలోకి ఎక్కాడు.

ఆ క్షణంలో స్టార్టయింది లారీ! ఆ కుదుపుకు సంజయ్ బాడీలో దొర్లాడు. లేచి నిల్చుందామను కుంటుండగా చల్లని వస్తువేదో అతని ఛాతీకి గుచ్చుకొంది. "నోరు మెదపక! అలాగే పడుకో!" చీకట్లో కీచుగా వినిపించిందో కంఠం.

అప్పుడే కమ్మని సెంటువాసన గుప్పుమంది నషాళానికి. ఆ వాసన అదివరకెక్కడో చూసినట్టే తోచిందిసంజయ్‌కి. ఎక్కడ? లారీకన్న వేగంగా ఆలోచిస్తోంది అతని మస్తిష్కం. అది టాప్ లేని బాడీ కావడంవల్ల చల్లని గాలి రివ్వున వీస్తూ శరీరాన్ని మంచు ముద్దగా మారుస్తోంది.

"నీవు చెప్పినట్టే వింటాగానీ, వెంటనే ఓ గొంగళి ఏర్పాటుచెయ్యి. చలికి చస్తున్నాను" అన్నాడు యెదురుగా కూర్చున్న ఆకారాన్ని చూస్తూ.

"పిచ్చిపిచ్చి వాగుడు కట్టిపెట్టి, నోరుమూసుకు పడుకో!" ఈసారి ఆ కంఠం కీచుగా గాక, కాస్త గట్టిగా వినిపించింది.

తన చెవుల్ని తనే నమ్మలేక పోయాడు సంజయ్. అది మగకంఠం కాదు. స్త్రీ కంఠం! అంతేగాక, ఆ కంఠాన్ని అంతకు ముందెక్కడో విన్నట్టే అనిపించిందతనికి.

"నువ్వే సెంటు వాడతావో తెలుసుకోవచ్చా బేబీ?" అడిగాడు గోముగా. ఆమె పలకలేదు. పిస్తోలు మొన ఇంకాస్త గట్టిగా అదిమిపట్టింది ఛాతీకి.

"పోనీ నీ వయసెంతో చెప్పు!"

"నా వయసుతో నీకేం పని?"

"నీ వయసు నాకన్నా ఎక్కువుంటే మాత్రం, నేను చచ్చినా నీ చేతుల్లో చావడానికొప్పుకోను. దానికంటే ఈ లారీలోంచి దూకి ఆత్మహత్య చేసుకోడం నయం!"

ఎంత ఆపుకుందామన్నా నవ్వాపుకోలేక, ఫక్కున నవ్వేసిందామె.

వెంటనే ఆ నవ్వు గుర్తుపట్టాడు సంజయ్.

"దీపా!"

"ఔను, నేనే." ఆమె నోట్లోంచి వాక్యం పూర్తి కావడం మరుక్షణం ఆమె చేతిలోని పిస్తోలు అతని చేతిలోకి రావడం ఒకేసారి జరిగాయి.

"పిస్తోలు చేజిక్కించుకున్నంత మాత్రాన నువ్వు నన్నేం చెయ్యలేవు." అందామె చాలా నింపాదిగా.

"అవును. అవతల నీ మనుషులు కేబిన్‌లో వున్నారు కదా?" అన్నాడు సంజయ్ వ్యంగ్యంగా.

"పొరపాటు. వాళ్ళతో నాకెలాంటి సంబంధంలేదు"

"అయితే నువ్విక్కడ కూర్చుని ఊరికే వేరుశెనక్కాయలు నములుతున్నావన్నమాట!"

"వేళాకోళానిక్కూడా వేళాపాళా వుంటుంది. ఈ రోజు కొందరు వ్యక్తులు హోటల్లోని ఓ గదిలో రహస్యంగా మాట్లాడుకోడం విన్నాను. వాళ్ళ మాటల్నిబట్టి ఈరాత్రి వాళ్ళెవర్నో బలవంతంగా యెక్కడికో తీసుకెళ్ళబోతున్నట్టు గ్రహించాను."

"అయితే, నువ్వాసంగతి పోలీసులకు తెల్పకుండా ఇక్కడెందుకు దాక్కున్నావ్?"

"నాకు ఎడ్వెంచర్స్ అంటే చాలా ఇష్టం. అవ్యక్తిని వాళ్ళెక్కడికి తీసికెళ్తారో స్వయంగా తెలుసుకోవాలనిపించింది."

"అలాగా, అయితే నిన్నిక్కణ్నుంచి తప్పకుండా కిందికి తోసితీరాలి."

"ఎందుకూ?"

"ఊరికే ఎడ్వెంచర్ కోసం! నాకూ నీలాగే ఎడ్వెంచర్ పిచ్చుంది మరి!" దీప ఏదో అనాలని నోరు తెరిచింది. అదే క్షణంలో లారీ స్పీడ్ స్లో అయినట్టు తోచి, బయటకు తొంగిచూశాడు సంజయ్.

లారీ రోడ్డుదిగి కుడివైపు వెళుతోంది. అక్కడంతా పిచ్చిమొక్కలూ, పొదలూ మొలిచివున్నాయి. వాటిని సమీపించగానే ఆగిపోయింది లారీ. హెడ్‌లైట్ల కాంతిలో ఆ పొదల మాటునుంచి మరో ముగ్గురు వచ్చారు ఇవతలికి. అందులో ఒకడి మొహంమీద నల్లని ముసుగు కప్పివుంది.

లారీ కేబిన్‌లోంచి ఉత్తమకుమార్, ఆ యిద్దరు వ్యక్తులూ కిందికి దిగారు. ఇప్పుడు ఉత్తమకుమార్ చేతులు వెనక్కి విరిచి కట్టబడి వున్నాయి.

వాళ్ళని చూడగానే ఆ ముసుగుమనిషి నవ్వి, "వెరీ గుడ్! నేను తీసుకురమ్మన్నది వీణ్ణే" అంటూ డిటెక్టివ్ వైపు తిరిగి "ప్రేరితను ఎక్కడ దాచావ్?" అడిగాడు కటువుగా.

"ప్రేరితా? ఎవరామె?"

"బుకాయించి లాభం లేదు. చిత్రహింసలు పెట్టి నిజాన్ని కక్కిస్తాం. ప్రేరితను నువ్వే ఎక్కడో దాచావని తెలిసింది. చెప్పు. ఎక్కడుంది ప్రేరిత?" అన్నాడతను జేబులోంచి పిస్తోలు తీస్తూ.

అంతవరకూ లారీలోంచి మౌనంగా ఆ దృశ్యం చూస్తూ వున్న సంజయ్, రివాల్వర్ని రెండు చేతుల్లో గట్టిగా పట్టుకుని ముందుకుచాపి గురి చూడసాగాడు.

"పదివరకూ లెక్క బెడతాను. ఆలోపల ప్రేరితను ఎక్కడ దాచావో చెప్పకుంటే, రెండు గుళ్లు నీకాళ్ళలో దిగబడతాయి జాగ్రత్త" అంటున్నాడు ముసుగుమనిషి ఉత్తమ్‌కుమార్‌తో.

ఇక ఆలస్యం చెయ్యదలుచుకోలేదు సంజయ్. ఊపిరి బిగబట్టి ట్రిగ్గర్ వత్తేశాడు.' 'ఢాం!'' దిక్కులు మారు మ్రోగాయి.

గుండు దూసుకెళ్ళి ముసుగు మనిషి జబ్బలో దిగింది. గావుకేక పెడుతూ పిస్తోలు కింద జారవిడిచాడతను.

సంజయ్ మెరుపులా లేచి నిల్చుని, "జాగ్రత్త ఎవ్వరూ కదలడానికి ప్రయత్నించకండి," అన్నాడు మిగతా వాళ్లను హెచ్చరిస్తూ.

అంతే. ఊహించని విధంగా, ముసుగు మనిషితో బాటు మిగతా నలుగురూ ఛెంగున పొదల్లోకి గెంతిపరుగు తీశారు. క్రమక్రమంగా వాళ్ళ అడుగుల చప్పుడు దూరమవ సాగింది.

"నీ తెలివి తక్కువ వల్లే వాళ్ళలా పారిపోగలిగారు" అంది దీప మొహం చిట్లిస్తూ.

"నా తెలివితక్కువతో కాదు. వాళ్ళదృష్టం బావుంది. అందుకే మెరుపులా పారిపోగలిగారు." అంటూ లారీ దిగాడు సంజయ్.

దీపకూడా దిగి ఉత్తమ్‌కుమార్‌ని సమీపించింది.

"మిమ్మల్ని వాళ్ళంత తేలిగ్గా యెలా లొంగదీసుకున్నారు?" అడిగాడు సంజయ్ అతని చేతికట్లువిప్పుతూ.

"నువ్వా ప్రోగ్రాంలో పానకంలో పుడకపాత్ర వహించడానికి కెళ్ళినప్పుడు, నేను బట్లర్ ద్వారా గ్రేప్ జ్యూస్ తెప్పించుకున్నాను. అది తాగిన మరుక్షణం

"కళ్ళలో మైకం కమ్ముతున్నట్టు తోచింది" అన్నాడు ఉత్తమకుమార్.

ఆదే సమయంలో హఠాత్తుగా పాదలమధ్య ప్రేలుడు వినిపించింది. మరుక్షణం గాలిలో ఏదో ఘాటైన వాసన వ్యాపించింది. చూస్తూ చూస్తూండగానే ముగ్గురూ నేల కొరగ సాగారు.

10

చిన్నగా మూలుగుతూ కళ్ళు తెరిచింది దీప.

కళ్ళు తెరవగానే పైన వెలుగుతున్న జీరోవాల్టుబల్బు కనిపించింది.

గాభరాగా లేచి కూర్చుని చుట్టూ కలయజూసింది.

డిటెక్టివ్ ఉత్తమకుమార్ కూ, సంజయ్ కూ అంత క్రితమే స్పృహవచ్చినట్టుంది. ఇద్దరూ గోడకి చేరిగిలబడి కూర్చునున్నారు.

అదృష్టవశాత్తూ వాళ్ళ కాళ్ళూ, చేతులూ బంధింపబడలేదు. గదిలో ఆ ముగ్గురుతప్ప మరోవస్తువు లేదు. అదే క్షణంలో తలుపు కవతలివైపునుంచి యెవ్వరివో మూలుగులు, సన్నగా దగ్గులూ వినిపించాయి వాళ్ళకి.

డిటెక్టివ్ ఉత్తమకుమార్ చటుక్కున లేచి, తలుపు దగ్గరికెళ్ళాడు. కీ హోల్లో కన్నుపెట్టి చూశాడవతలికి. అవతలివైపు మరోగది వున్నట్టుంది. కొద్దిగా మంచం, ఆ మంచంపై కాళ్ళూ కనిపిస్తున్నాయి.

"దీపా, నీ హేర్ పిన్ను ఒకసారిలా ఇవ్వు" అన్నాడు వెనుదిరిగి.

"హేర్ పిన్నా? ఎందుకూ?"

"ఇక నటించడం కట్టిపెట్టు. నువ్వెవరో, నీ పుట్టుపూర్వోత్తరాలేమిటో నాకు బాగా తెలుసు. నువ్వు మద్రాసు క్రయింబ్రాంచిలో లేడీ ఇన్వెస్టిగేటర్వి కదూ"

రక్తమంతా శరీరపు యితరభాగాలకు పాకినట్టు తెల్లబడింది దీప మొహం.

"ఏమిటీ? ఈమె మద్రాసు క్రయింబ్రాంచి మనిషా?" అన్నాడు సంజయ్ నోరు తెరుస్తూ.

"అవును. ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డితో కలిసి అనేక కేసుల్లో పనిచేసింది. ఈమె పేరు దీప కాదు. షీల. ఇదివరకీమె నన్ను చూడని కారణంగా గుర్తుపట్టలేదు. ఒకటి రెండుసార్లు నేనే ఈమెని క్రయింబ్రాంచి హెడ్ క్వార్టర్సులో చూశాను. వృధా కబుర్లకిది సమయం కాదు. షీలా, వెంటనే నీ హేర్‌పిన్ ఇలా యివ్వు!" అన్నాడు ఉత్తమ్‌కుమార్.

షీల మారుమాటాడకుండా హేర్‌పిన్ తీసి ఇచ్చింది. దాన్ని కీహోల్లో దూర్చి తెరవడానికి బ్రహ్మప్రయత్నం ప్రారంభించాడు ఉత్తమ్‌కుమార్. ఎంతో కష్టపడ్డాక గానీ క్లిక్ మనలేదు లాక్.

పిడితిప్పి మెల్లిగా తలుపు తెరిచాడు.

అవతలి గదిలో లేత నీలిరంగు బల్బు వెలుగుతోంది. ఓ గోడవారగా నులకమంచంమీద పడున్నాడో వృద్ధుడు. అస్వస్థంగా పెరిగిన గెడ్డం, చింపిరి జుత్తు.

తలుపు తెరుచుకున్న చప్పుడు విని మూలగడం ఆపి ఇటు తిరిగాడు.

ఉత్తమ్‌కుమార్‌తోబాటు సంజయ్, షీలాకూడా ఆ గదిలో అడుగుపెట్టారు.

వాళ్ళని చూడగానే ఆ వృద్ధుడు అతికష్టంమీద లేచి కూర్చుని "వామ్మయ్యా! మీరా గదిలోంచి తప్పించుకుని బయటపడగలిగారా. ఆ దుర్మార్గులు ఇంతక్రితమే స్పృహ తప్పివున్న మిమ్మల్ని తీసుకొచ్చి, ఆ గదిలో పడేసి

వెళ్ళారు. మీతోబాటు నన్నూ ఈ నరకంనుంచి విముక్తుణ్ణి చెయ్యండి. ఎన్నాళ్ళనుంచో నేనిక్కడ మగ్గిపోతున్నాను.'' అన్నాడు.

“ఎవరు మీరు?'' అడిగాడు ఉత్తమకుమార్.

“నాపేరు పీతాంబరం. డాక్టర్ పీతాంబరం.''

ముగ్గురు డిటెక్టివ్ లూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

“రెండేళ్ళక్రితం ప్రేరిత భాగోగులు చూసిన వ్యక్తి మీరేకదూ?''

“అవును. ప్రేరిత ఎలా తెలుసు మీకు?'' అడిగాడతనాశ్చర్యంగా.

“చెబుతాను. మిమ్మల్ని ఇక్కడ ఎవరు బంధించారు?''

“అదొక కథ. విషాద కథ. ఒక విశ్వాస ఘాతకుడి వల్ల నాకీ దుర్భరస్థితి ప్రాప్తించింది. ప్రొఫెసర్ విష్ణువర్ధన్ పేరు విన్నారా మీరు? నేనాయన అసిస్టెంటునే...'' ఆ వృద్ధుడిమాట ఇంకా పూర్తికాలేదు.

అంతలో అవతలినుంచి ఎవ్వరో గది తలుపు తెరుస్తున్న చప్పుడు వినిపించింది. నలుగురూ ఊపిరి బిగబట్టి ఊరుకున్నారు. సడన్ గా ఉత్తమకుమార్ కో ఆలోచన తట్టింది.

వెంటనే ఆ వృద్ధుడి చెయ్యిపట్టుకొని, “మీరు నా వెంట రండి. త్వరగా.'' అంటూ అతన్ని దాదాపు ఈడ్చుకుంటూ రెండో గదిలోకిదూరి, తలుపు మూసుకున్నాడు.

అదే సమయంలో ఇవతలిగది తలుపు తెరుచుకుంది. ఆ ముసుగుమనిషీ, అతని అనుచరులూ ప్రవేశించారు గదిలోకి. వాళ్ళ చేతుల్లో నల్లగా నిగనిగ మెరుస్తున్నాయి పిస్తోళ్ళు. షీలా, సంజయ్ లని చూడగానే అంతా వులిక్కిపడ్డారు.

"మీరిద్దరూ ఆ గదిలోంచి యెలా బయటపడ్డారు? మిగతా ఇద్దరెక్కడ?" అన్నాడు ముసుగు మనిషి ఆశ్చర్యంగా.

రెండో గదివైపు సైగ చేశాడు సంజయ్.

అతను ఒక్క వురుటున ఆ తలుపు దగ్గరికెళ్ళి, "ఏయ్, వెంటనే తలుపు తెరవ్! లేదా, నీ అనుచరులిద్దర్నీ కాల్చి పారేస్తాను" అరిచాడు.

లోపల ఉత్తమ్‌కుమార్ నవ్వు వినిపించింది. "నీకంటే ముందు నేనీ ముసలాణ్ని పీకపిసికి చంపేస్తాను. రెండేళ్ళ నుంచీ అతన్నిక్కడ బంధించి వుంచావంటే అతని అవసరం నీకెంతవుందో వేరే చెప్పనవసరంలేదు. ఏ అమ్మాయి కోసం నువ్వింత హడావుడి చేస్తున్నావో ఆ (షేరి) ఒకచోట నా బందీగావుంది. చెప్పు. ఆమెను పొందడానికి ఎంత డబ్బివ్వగలవు?"

ఆ ముసుగు మనిషికి ఏం జవాబివ్వాలో వెంటనే తట్టలేదు కాబోలు. కాసేపు ఆలోచిస్తూండి పోయాడు. తరవాత తలెత్తి. "ఎంత కావాలి నీకు?" అడిగాడు.

"పాతిక వేలు!"

"అంతివ్వలేను. పదివేలతో సరిపెట్టుకో!"

"పదరదు! ఇంకా బేరానికి దిగావంటే. పాతిక వేలు పోయి ముప్ఫయి వేలవుతాయి."

"సరే ఇస్తాను. తలుపు తెరువ్!"

"అలా కాదు. ముందు మీ పిస్తోళ్ళన్నీ నా అనుచరుల కప్పగించండి. అప్పుడు తెరుస్తాను తలుపు" అన్నాడు ఉత్తమ్‌కుమార్.

ముసుగుమనిషి ఇరకాటంలో పడిపోయాడు. వేరే దారి లేదు. పిస్తోళ్ళు సంజయ్ కప్పగించమని తన అనుచరులకు ఆజ్ఞాపించాడు. మరుక్షణం వాళ్ళ పిస్తోళ్ళన్నీ షీలా,

సంజయ్‌ల చేతుల్లోకి వచ్చాయి.

"సార్! ఆయుధాలు మా కప్పగించారు. ఇక బైటికి రండి" అన్నాడు సంజయ్.

తలుపు తెరుచుకుంది. నవ్వుతూ ఇవతలికి వచ్చాడు ఉత్తమ్‌కుమార్.

"త్వరగా చెప్పు. క్యాష్ కావాలా? చెక్కు కావాలా?" అన్నాడు ముసుగుమనిషి.

"క్యాష్ ఏమిటి? చెక్కేమిటి?"

"ఇప్పుడేకదా ప్రేరిత విషయంలో బేరం కుదుర్చుకున్నావ్?"

విరగబడి నవ్వాడు ఉత్తమ్‌కుమార్. "అవసరాన్నిబట్టి ఒక్కొసారి ఇటువంటి ఊకదంపుడు బేరాలు కుదుర్చుకోక తప్పదు" అని షీల చెవిలో ఏదో చెప్పి, ఆమె దగ్గరున్న రెండు పిస్తోళ్ళు అందుకున్నాడు ఉత్తమ్‌కుమార్.

మరుక్షణం షీల గదిలోంచి గబగబ బైటికెళ్ళిపోయింది.

"మీరంతా చేతులెత్తి ఆ గోడవైపు తిరిగి నిల్చోండి" అన్నాడు ఉత్తమ్‌కుమార్ గంభీరంగా.

ఒకేసారి నాలుగు పిస్తోళ్ళు తమవైపే గురిపెట్టి వున్నాయి. అతను చెప్పినట్టు చెయ్యక తప్పలేదు వాళ్ళకు. అంతలో షీల రెండుమూడు తాళ్ళతో తిరిగి వచ్చిందక్కడికి.

"సంజయ్! నీ దగ్గరున్న పిస్తోళ్ళు షీలకిచ్చి, ఆ తాళ్ళతో వాళ్ళని బంధించు" అన్నాడు ఉత్తమ్‌కుమార్.

పిస్తోళ్ళు షీల కందించి, తాళ్ళతో ఒక్కొక్కడి చేతులూ వెనక్కి విరిచి కట్టేశాడు సంజయ్.

"ఇక ఆ పెద్దమనిషి బురఖా కాస్త తొలగించు. అతని

మొహం చూడాలని నా కళ్ళు తహతహలాడుతున్నాయి"
అన్నాడు ఉత్తమ్‌కుమార్.

సంజయ్ వెంటనే ముసుగుమనిషి మొహంమీంచి ముసుగు లాగేశాడు.

"మధుబాబూ! నువ్వా!!" అన్నాడు ఉత్తమ్‌కుమార్ నివ్వెరబోతూ.

మధుబాబు మొహంలో కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు.

"ఇంతసేపూ నువ్వు కంఠంమార్చి నాతో మాట్లాడావన్నమాట. అందుకే గుర్తించలేకపోయాను. ప్రొఫెసర్ విష్ణువర్ధన్ గారి అసిస్టెంట్‌ను ఇక్కడెందుకు బంధించావ్? ప్రొఫెసర్ ఎక్కడున్నారు?"

"ఆయన అజ్ఞాతవాసంలో వుంటాడు. ఎవ్వరికీ కనిపించడు."

"అబద్ధం. నాలుగేళ్ళ క్రితం వీడే ఆయనకి విషంఇచ్చి చంపేశాడు" అంటూ పక్కగదిలోంచి బైటికి వచ్చాడా వృద్ధుడు.

"దయచేసి అసలు కథేమిటో శాస్త్ర వివరంగా చెప్పండి" అన్నాడు ఉత్తమ్‌కుమార్ ఆయన్ని చూస్తూ.

"ప్రొఫెసర్ విష్ణువర్ధన్‌కు తన ప్రయోగాలూ, పరిశోధనలూ తప్ప మరో ధ్యాస వుండేదికాదు. కొత్త కొత్త ప్రయోగాలతోనూ, చిత్ర విచిత్ర పరిశోధనలతోనూ ఎల్లప్పుడూ మునిగి తేలుతుండేవాడు. నేనాయనకు సహాయకుడిగా వ్యవహరించేవాణ్ని.

ప్రేరిత ఆయన కూతురే! ఆ అమ్మాయి ఐదేళ్ళ పాపగా వున్నప్పుడే ఆయన భార్య మరణించింది. అప్పుడే

ఆయనకో కొత్త ప్రయోగం స్ఫురించింది. తలిదండ్రులూ, బంధుమిత్రులూ ఎవ్వరూ లేక, తామీలోకంలో ఏకాకుల మన్న భావంతో పెరిగే పిల్లల మానసిక స్థితి ఎలా వుంటుంది. వారి శారీరక, మానసిక ఎదుగుదల ఎలా వుంటుంది?

ఈ విషయాలు క్షుణ్ణంగా పరిశీలించి, మన స్తత్వ శాస్త్రంలో మరో కొత్త అధ్యాయాన్ని పొందుపరచాలనుకున్నారాయన. ఆ ప్రయోగానికి తన కన్నకూతుర్నే బలిపెట్టదలచి, ఆమెనో మూగదాని ప్రాపకంలో వుంచారు. ఆ ప్రయోగంలో ఓ మగపిల్లవాడు కూడా అవసరమై ఓ అనాథ శరణాలయం నించి, ఎనిమిదేళ్ళ కుర్రాణ్ని దత్తత స్వీకరించారు. వాడే ఈ మధుబాబు!

ఆయన కోరుకున్న విధంగానే అక్కడ ప్రేరితా, ఇక్కడ మధుబాబూ పెరిగి పెద్దకాసాగారు. ప్రతినెలా ఆయన ఒక డాక్టర్ రూపంలో వాళ్ళను పరీక్షిస్తుండే వారు.

ప్రేరితకు పద్దెనిమిదేళ్ళు నిండగానే హఠాత్తుగా ఆ మూగముసలిది మరణించింది. దాంతో, ఆ అమ్మాయి బాగోగులు చూసే బాధ్యత నామీద పడింది. ఆ రోజుల్లోనే ప్రొఫెసర్ గారు ఎనర్జిన్ ఔషధం గురించి ప్రయోగాలు జరుపుతున్నారు.

పని వత్తిడివల్ల తన ఆ సిపాస్తుల పర్యవేక్షణా భారాన్నంతా ఆయన నాపై వదిలారు. నేను తరచూ వెళ్ళి ప్రేరితను చూసి వచ్చేవాణ్ని. ప్రతినెలా ఆమె ఖర్చులకు ఐదువందల చెక్కు పంపేవాణ్ని.

అంతలో ప్రొఫెసర్ ప్రయోగం పూర్తయింది. ఎనర్జిన్ మందు తయారైంది. అప్పుడే ఈ విశ్వాసఘాతకుడిలో దురాశ ప్రవేశించింది. సైనైడ్ విషంతో ప్రొఫెసర్ని

చంపేసి, ఆ ఫర్మ్ లా స్వంతం చేసుకున్నాడు. బ్యాంకు లావాదేవీలన్నీ నా పేరనే వున్నాయిగనక, నన్నిక్కడ ప్రాణాలతో బంధించి, బలవంతంగా పెద్ద మొత్తాల్లో చెక్కులు రాయించుకునేవాడు.

ప్రేరితపు మైనారిటీ తీరగానే ఆమెను వివాహమాడి, ఆ విధంగా ఆమెకు చెందవలసిన అపార ఆస్తిని కాజేయాలనుకున్నాడు... నా లెఖ్ఖ ప్రకారం గత నెల పదవ తేదీతో ప్రేరితపు మైనారిటీ పూర్తయింది'' అంటూ ముగించాడు డాక్టర్ పీతాంబరం.

బంధించబడున్న మధుబాబువైపు చూశాడు ఉత్తమ్ కుమార్.

''ఇప్పుడర్థమైంది అసలు కథ! ప్రేరితపు మైనారిటీ తీరిందని తెలియగానే ఆమెను బలవంతంగా ఎత్తుకెళ్ళి పెళ్ళి చేసుకోవాలని టూ స్టార్ హోటల్ చేరుకున్నావ్. అక్కడ ఆమె వరదరాజన్ అనే వ్యక్తివెంట వుంటుందని తెలిసి, వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారేమోనని అపోహ పడి, వరదరాజన్ని కత్తితో పొడిచి చంపేశావ్.

ఆ నేరం సంజయ్ మీదికి రావాలని ఆ కత్తిని మా గదిలో పడేశావ్. ప్రొఫెసర్ కనిపెట్టిన ఎనర్జీన్ మందుతో లక్షలు గడించాలనుకున్నావ్. చివరికి నీవు గడించింది ఇనప సంకెళ్ళు, జైలు కటకటాలూ!!'' అన్నాడు పిస్తోలు జేబులో వేసుకుంటూ.

—: ఐపోయింది :—